JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రభాత
# జయభేరి
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
మేడ్చల్ - మల్కాజిగిరి | మంగళవారం 05-05-2026
Medchal - Malkajgiri | Tuesday 05-05-2026
Follow: jayabherinews
సంపుటి : 02 | సంచిక : 338
పేజీలు : 8 | వెల : 5
Vol. 02 | Issue 338 | Pages : 8 | ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com



## బెంగాల్‌లో మమతా బెనర్జీ ఘోర ఓటమి



జయభేరి, న్యూఢిల్లీ:

పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో కీలక మలుపు తిప్పేలా తాజా ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. సువేందు అధికారి, భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి, ముఖ్యమంత్రి మమతా బెనర్జీను ఆమె స్వంత నియోజకవర్గమైన భవానీపూర్‌లో సుమారు 15 వేల ఓట్ల తేడాతో ఓడించడం రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీసింది. ఒకే నాయకురాలిపై వరుసగా రెండోసారి విజయం సాధించడం ద్వారా అధికారి తన రాజకీయ బలం ఎంతగా పెరిగిందో చూపించారు. అధికారిక ఫలితాల ప్రకారం, అధికారి 73,463 ఓట్లు సాధించగా, మమతా బెనర్జీకి 58,349 ఓట్లు మాత్రమే లభించాయి. గతంలో టీఎంసీకి అడ్డుకట్టలేని బలమైన స్థావరంగా భావించిన భవానీపూర్‌లో ఇలాంటి ఫలితం రావడం పార్టీకి పెద్ద ఎదురుదెబ్బగా విశ్లేషిస్తున్నారు. దక్షిణ బెంగాల్ రాజకీయాల్లో ఈ నియోజకవర్గానికి ప్రత్యేక ప్రాధాన్యం ఉండటంతో, ఈ ఓటమి ప్రభావం మరింత ఎక్కువగా కనిపిస్తోంది. సువేందు అధికారి రాజకీయ ప్రయాణం కూడా ఈ ఫలితాన్ని మరింత ఆసక్తికరంగా మార్చింది.

...మిగతాది 2 లో



# బెంగాల్‌లో ఘన విజయం

- హింసకు స్వస్తి పలికి ఉజ్వల భవిష్యత్తును నిర్మిద్దామన్న మోదీ!

జయభేరి, న్యూఢిల్లీ:

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ సాధించిన అద్భుత విజయం దేశ రాజకీయాల్లో పెను సంచలనం సృష్టించింది. ఈ చారిత్రాత్మక ఘట్టం అనంతరం, సోమవారం నాడు ఢిల్లీలోని బీజేపీ జాతీయ ప్రధాన కార్యాలయంలో జరిగిన విజయోత్సవ సభలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రసంగించారు. వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తల ఉత్సాహాన్ని చూస్తూ, ప్రధాని ఒకవైపు గెలుపు ఉత్సాహాన్ని ప్రదర్శిస్తూనే, మరోవైపు రాష్ట్రంలో శాంతిని నెలకొల్పాలనే సయోధ్య ధోరణితో కూడిన సందేశాన్ని ఇచ్చారు. దశాబ్దాలుగా పశ్చిమ బెంగాల్‌ను పట్టిపీడిస్తున్న రాజకీయ హింసా సంస్కృతికి ఇకనైనా ముగింపు పలకాలని ఆయన గట్టిగా పిలుపునిచ్చారు.

రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ వాతావరణంలో సమూల మార్పు రావాల్సిన అవసరం ఉందని ప్రధాని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ఆయన ప్రాసలతో కూడిన ఒక శక్తివంతమైన నినాదాన్ని వినిపించారు. "ఈ విజయం ఎవరి మీదో కక్ష తీర్చుకోవడానికి (బద్లా) వచ్చినది కాదు, రాష్ట్రంలో అభివృద్ధిని తీసుకురావడానికి (బద్లవ్) వచ్చిన మార్పు" అని ఆయన స్పష్టం చేశారు. అలాగే, ప్రజలు ఇకపై భయం (భయ్) నీడలో బతకాల్సిన అవసరం లేదని, రాష్ట్రం ఉజ్వల భవిష్యత్తు (భవిష్యత్) గురించి ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. పాత గొడవలను పక్కన పెట్టి, అంతులేని ఈ హింసా చక్రాన్ని అందరం కలిసి అంతం చేద్దామని ఆయన పిలుపునిచ్చారు.

...మిగతాది 2 లో

# విజయుడు దళపతి విజయ్

- టీవీకే చీఫ్ విజయ్ మరో ఎంజీఆర్
- తమిళనాడు ఎన్నికల ఫలితాల్లో సంచలనం సృష్టించిన విజయ్
- చెన్నైలోని విజయ్ నివాసంలో సందడి
- టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ తర్వాత ఆ స్థాయిలో విజయం సాధించిన సినీతార దళ పతి విజయ్ మాత్రమే



"50 ఏళ్లుగా ద్రవిడ రాజకీయాలకు కంచుకోటగా ఉన్న తమిళనాడులో పెను మార్పులు సంభవిస్తున్నాయి. దశాబ్దాలుగా డీఎంకే, అన్నాడీఎంకే మధ్యనే సాగిన ద్విముఖ పోరుకు ఈసారి తెరపడింది. నటుడు విజయ్ రాజకీయ ప్రవేశంతో రాష్ట్ర రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారిపోయింది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ఊహించని రీతిలో అధికార డీఎంకే వెనకబడిపోగా, విజయ్ కొత్త పార్టీ, అన్నాడీఎంకే కూటమి ఆధిక్యంలోకి దూసుకెళ్లడం సంచలనం సృష్టిస్తోంది. ఎన్నికలకు ముందు చాలా ఎగ్జిట్ పోల్స్ డీఎంకే సునాయాసంగా రెండోసారి అధికారంలోకి వస్తుందని అంచనా వేశాయి. అయితే, 'యాక్సిస్ మై ఇండియా' సర్వే మాత్రం 'విజయ్ ఎఫెక్ట్' బలంగా ఉంటుందని, ఆయన పార్టీ సుమారు 106 స్థానాలు గెలుచుకుని కింగ్మేకర్గా అవతరించే అవకాశం ఉందని ముందుగానే సూచించింది.

జయభేరి, చెన్నై :

ఎన్టీఆర్, ఎంజీఆర్ తరహాలో స్టార్ హీరో విజయ్ సైతం తొలి ఎన్నికల్లోనే సూపర్ హిట్ అయ్యారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ విజిల్ గుర్తు ప్రభంజనం సృష్టించింది. విజయ్‌కు చెందిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ సింగిల్‌గానే 100కుపైగా అసెంబ్లీ సీట్లలో ఆధిక్యంలో ఉంది. దీంతో కాబోయే తమిళనాడు సీఎం హీరో విజయే అని స్పష్టమైంది. అయితే దక్షిణాదిన గత కొన్ని దశాబ్దాల్లో సినీరంగానికి చెందిన

...మిగతాది 2 లో



## పాలమూరు నుంచే తొలి అడుగు

- కృష్ణా జలాల్లో తెలంగాణకు జరిగిన అన్యాయంపై గళమెత్తనున్న టీఆర్ఎస్ అధినేత్రి కవిత
- 8న చౌదరిగూడెం వద్ద పాలమూరు
- రంగారెడ్డి ప్రాజెక్టు సాధన సభ
- పోస్టర్ ఆవిష్కరించిన తెలంగాణ రక్షణ సేన నాయకులు

జయభేరి, హైదరాబాద్ :

తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీని స్థాపించిన తర్వాత ఆ పార్టీ అధినేత్రి, ఉద్యమ నాయకురాలు కల్వకుంట్ల కవిత పాలమూరు గడ్డ మీది నుంచే రాజకీయంగా మొదటి అడుగు వేయనున్నారు. పార్టీ స్థాపించిన తర్వాత జోగులాంబ అమ్మవారి ఆశీస్సులు తీసుకుని ముందుకు సాగుతానని ప్రకటించిన కల్వకుంట్ల కవిత

...మిగతాది 2 లో

## కేరళం సారథులకు అభినందనలు

- సీఎం రేవంత్ రెడ్డి
- పదేళ్ల తర్వాత కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమికి పట్టం
- యూడీఎఫ్ గెలుపులో మేనిఫెస్టో కీలక పాత్ర



జయభేరి, హైదరాబాద్ :

కేరళ వంటి చైతన్యవంతమైన గడ్డపై అసాధారణ పట్టుదలతో, అలుపెరగని పోరాట పటిమను ప్రదర్శించి, స్ఫూర్తిదాయక విజయాన్ని కైవసం చేసుకున్న కాంగ్రెస్ నాయకత్వంలోని యూడీఎఫ్ కూటమి సారథులకు, అంకితభావం కలిగిన కార్యకర్తలకు, పార్టీ సైనికులందరికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భినందనలు తెలిపారు. ఈ చారిత్రాత్మక విజయం దిశగా మా అందరినీ నడిపించిన మన గొప్ప నాయకత్వానికి, ముఖ్యంగా రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, ప్రియాంక గాంధీ, దీపా దాస్ మున్షీ, కే.సి. వేణుగోపాల్ అభినందనలు తెలియజేస్తున్నానని అన్నారు.

...మిగతాది 2 లో



## అవినీతి ఆరోపణలపై కమిషన్

జయభేరి, హైదరాబాద్ :

గత ప్రభుత్వంలో జరిగిన విద్యుత్ కొనుగోళ్లు, భద్రాద్రి, యాదాద్రి థర్మల్ ప్రాజెక్టులలో వచ్చిన అవినీతి ఆరోపణలపై జస్టిస్ మదన్ బి. లోకూర్ నేతృత్వంలోని కమిషన్ సమర్పించిన నివేదికపై తదుపరి దర్యాప్తు కోసం కేసును సీబీఐకి అప్పగించడానికి రాష్ట్ర మంత్రిమండలి ఆమోదం తెలిపింది. విద్యుత్తు కొనుగోళ్లతో పాటు భద్రాద్రి, యాదాద్రి విద్యుత్తు ప్లాంట్లలో అవకతవకలు జరిగినట్టు వచ్చిన ఆరోపణలపై ప్రభుత్వం నియమించిన జస్టిస్ లోకూర్ నేతృత్వంలోని కమిషన్ అందజేసిన 114 పేజీల నివేదికపై రాష్ట్ర అడ్వకేట్ జనరల్ సూచనలు, అభిప్రాయాలపై మంత్రిమండలి చర్చించింది. ఇందులో అంతర్రాష్ట్ర అంశాలు ఇమిడి ఉండటం, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలతో ముడిపడి ఉన్నందున దీనిపై సమగ్రమైన, నిష్పాక్షిక దర్యాప్తు కోసం ఈ వ్యవహారాన్ని CBI విచారణకు అప్పగించాలని మంత్రిమండలి తీర్మానించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో జరిగిన మంత్రిమండలి సమావేశం పలు నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్రంలో కురిసిన అకాల వర్షాలతో వివిధ జిల్లాల్లో పంటలు, పంట ఉత్పత్తులకు నష్టం వాటిల్లిన సమాచారంపై మంత్రివర్గం చర్చించింది. ఆయా జిల్లాల ఇంచార్జి మంత్రులు బాధ్యత తీసుకుని వివరాలు తెప్పించుకుని, రైతులను ఆదుకునే చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి గారు ఆదేశించారు. రాష్ట్రంలో భూముల ధరలను సవరించాలని, కొన్ని ప్రాంతాల్లో

...మిగతాది 2 లో

మొదటిపేజీ తరువాయి

## బెంగాల్‌లో ఘన విజయం

ఈ ఎన్నికల తీర్పును బెంగాల్ చరిత్రలో ఒక కీలక మలుపుగా మోదీ అభివర్ణించారు. బెంగాల్ ప్రజలు చిరకాలంగా కోరుకుంటున్న 'పరివర్తన' (మార్పు) ఇన్నాళ్లకు నెరవేరిందని, ఇప్పుడు రాష్ట్రం 'భయముక్త్' (భయం లేనిది)గా మారిందని ఆయన వ్యాఖ్యానించారు. సామాన్య పౌరులు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవడం వల్ల వచ్చిన ఈ ఫలితాలు, బెంగాల్ రాజకీయ వాతావరణంలో వీస్తున్న కొత్త గాలికి ప్రతిరూపాలని ఆయన జోడించారు. కేవలం పశ్చిమ బెంగాల్‌కే పరిమితం కాకుండా, అస్సాం, పుదుచ్చేరి, తమిళనాడు మరియు కేరళ రాష్ట్రాల్లో కూడా బీజేపీ మరియు దాని మిత్రపక్షాలు గణనీయమైన ప్రభావాన్ని చూపాయని ప్రధాని గుర్తు చేశారు. ఆయా రాష్ట్రాల ఓటర్లకు ఆయన శిరస్సు వంచి నమస్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ విజయంలో అహర్నిశలు శ్రమించిన లక్షలాది మంది బీజేపీ కార్యకర్తలను ఆయన హృదయపూర్వకంగా అభినందించారు. కార్యకర్తల్లో చిన్న, పెద్ద అనే తేడా లేదని.. ప్రతి ఒక్కరి పోరాటం వల్లే బెంగాల్ వంటి క్లిష్టమైన రాష్ట్రంలో కమలం వికసించిందని ఆయన కొనియాడారు. ఈ విజయానికి ఉన్న భౌగోళిక ప్రాధాన్యతను వివరిస్తూ, గంగా నది పరివాహక ప్రాంతమంతటా ఇప్పుడు బీజేపీ పాగా వేసిందని మోదీ వ్యాఖ్యానించారు. "గంగోత్రి నుండి గంగాసాగర్ వరకు——అంటే ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, బీహార్ దాటుకుని ఇప్పుడు పశ్చిమ బెంగాల్ వరకు కమలం వికసించింది. గంగానది ప్రవహించే ప్రధాన రాష్ట్రాలన్నింటిలో ఇప్పుడు బీజేపీ లేదా ఎన్డీయే ప్రభుత్వాలే అధికారంలో ఉండటం ఒక చారిత్రాత్మక పరిణామం" అని ఆయన వివరించారు. ఇది భారతదేశ అభివృద్ధికి ఒక గొప్ప సంకేతమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.
ఈ ఫలితాలను కేవలం ఒక పార్టీ గెలుపుగా కాకుండా, ప్రజాస్వామ్య గొప్పతనంగా చూడాలని ప్రధాని కోరారు. ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమని, కానీ ఐదు రాష్ట్రాల ప్రజలు ఈ ఎన్నికల ప్రక్రియలో పాల్గొన్న తీరు చూస్తే.. భారతదేశం ఎందుకు 'ప్రజాస్వామ్యానికి తల్లి' (Mother of Democracy) వంటిదో ప్రపంచానికి చాటి చెప్పినట్లు అయిందని అన్నారు. ఈ విజయం భారత రాజ్యాంగానికి మరియు సామాన్య పౌరుడికి లభించిన విజయమని ఆయన ఉద్ఘాటించారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా కూడా ఈ సందర్భాన్ని పురస్కరించుకుని కీలక వ్యాఖ్యలు చేశారు. బెంగాల్ ప్రజలు బుజ్జగింపు రాజకీయాలను తిరస్కరించారని, చొరబాటుదారులకు, వారికి మద్దతు ఇచ్చే సానుభూతిపరులకు ఈ తీర్పు ద్వారా తగిన గుణపాఠం నేర్పారని ఆయన విమర్శించారు. గతాన్ని విస్మరించి, బెంగాల్ కోల్పోయిన వైభవాన్ని మరియు సంస్కృతిని పునరుద్ధరించడానికి, రాష్ట్రాన్ని మళ్ళీ 'సోనార్ బంగ్లా'గా మార్చడానికి బీజేపీ ప్రభుత్వం రేయింబవళ్లు శ్రమిస్తుందని ఆయన హామీ ఇచ్చారు.

## విజయుడు దళపతి విజయ్

ఎంతోమంది స్టార్‌లు రాజకీయాల్లోకి వచ్చారు. అందులో సక్సెస్ రేటు చాలా తక్కువే. టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ తర్వాత ఆ స్థాయిలో విజయం సాధించిన సినీతార దళపతి విజయ్ మాత్రమే కాడవం గమనార్హం. ఎన్టీఆర్ తర్వాత విజయ్ కాంత్, మెగాస్టార్ చిరంజీవి, పవన్ కల్యాణ్ లాంటి స్టార్ హీరోలు రాజకీయాల్లో వచ్చినా ఈ స్థాయిలో విజయం సాధించలేకపోయారు. ఈ సందర్భంగా రాజకీయ అరంగేట్రంలోనే సీఎంలుగా అయిన ఎన్‌టీఆర్, ఎంజీఆర్‌ల ప్రస్థానంతో హీరో విజయ్ తాజా విజయాన్ని పోల్చి చూద్దాం.
హీరో విజయ్ చాలా తక్కువ టైంలోనే రాజకీయాల్లో అద్భుత ఫలితాన్ని సాధించారు. ఆయన 2024 ఫిబ్రవరి 2నే తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీని ప్రకటించారు. 2024 ఆగస్టు 22న పార్టీ జెండాను, గీతాన్ని ఆవిష్కరించారు. 2024 అక్టోబర్ 27న టీవీకే సిద్ధాంతాలను విజయ్ ప్రకటించారు. ఈ పార్టీకి కేంద్ర ఎన్నికల సంఘం 2026 జనవరి 22న అధికారికంగా 'విజిల్' గుర్తును కేటాయించింది. అంటే టీవీకే పార్టీకి గుర్తును మూడు నెలల క్రితమే కేటాయించారు. అయినప్పటికీ అతిస్వల్ప వ్యవధిలోనే అత్యంత వేగంగా రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల ప్రజలకు తన పార్టీ గుర్తును, అజెండాను చేరవేయడంలో విజయ్ సక్సెస్ అయ్యారు. ఏ కూటమితోనూ పొత్తు పెట్టుకోకుండా మొత్తం 234 స్థానాల్లో ఒంటరిగా పోటీ చేస్తామని మార్చి 18నే ఆయన ప్రకటించారు. వ్యూహంలో ఎంజీఆర్ బాట వాస్తవానికి డీఎంకే పార్టీని సీఎన్ అన్నాదురై 1949 సెప్టెంబర్ 17న స్థాపించారు. ఆయన 1969 ఫిబ్రవరి 3న మరణించిన అనంతరం కరుణానిధి ముఖ్యమంత్రి అయ్యారు. ఆ సమయానికి ఎంజీ రామచంద్రన్ (ఎంజీఆర్) డీఎంకేలోనే ఉన్నారు. ఆయనకు పార్టీలో మంచి పాపులారిటీ ఉండేది. అన్నాదురై మరణం అనంతరం రాష్ట్ర ప్రభుత్వాన్ని, డీఎంకే పార్టీని నడిపే విషయంలో కరుణానిధి, ఎంజీఆర్ మధ్య విభేదాలు వచ్చాయి. 1971లో కరుణానిధి మంత్రి వర్గంలోనూ ఎంజీఆర్‌కు చోటు దక్కలేదు. దీంతో డీఎంకేలోనే ఉంటూ, కరుణానిధి సర్కారుకు వ్యతిరేకంగా ఎంజీఆర్ మాట్లాడటం మొదలుపెట్టారు. 1972లో డీఎంకే కోశాధికారిగా ఉన్న సమయంలో ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. డీఎంకే మంత్రుల వ్యక్తిగత ఆస్తుల లెక్కలను విడుదల చేయాలని ఎంజీఆర్ డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో 1972 అక్టోబరు 10న ఎంజీఆర్‌ను డీఎంకే నుంచి బహిష్కరించారు. తనను పార్టీ నుంచి పంపేసిన వారం రోజుల్లోనే 1972 అక్టోబర్ 17న అన్నాడీఎంకే పార్టీని ఎంజీఆర్ ప్రకటించారు. అన్నాదురై ఆశయాల సాధన కోసం పనిచేసే అసలైన పార్టీ అన్నాడీఎంకేనే అంటూ ప్రజలకు చేరువయ్యారు. కట్ చేస్తే, 1977 తమిళనాడు ఎన్నికల్లో ఎంజీఆర్ నాయకత్వంలోని అన్నాడీఎంకే కూటమి 144 సీట్లతో నిర్ణయాత్మక విజయాన్ని అందుకుంది. హీరో విజయ్ సైతం ఇలాంటి వ్యూహాన్నే క్షేత్రస్థాయిలో అమలు చేశారు. డీఎంకే, అన్నాడీఎంకేలకు ప్రత్యామ్నాయంగా టీవీకే పార్టీ నిలుస్తుందని విజయ్ చేసిన ప్రకటనలు నిజమయ్యాయి. ఈ ఎన్నికల ఫలితాలే అందుకు నిదర్శనం.

## బెంగాల్‌లో మమతా బెనర్జీ ఓటమి


ఒకప్పుడు తృణమూల్ కాంగ్రెస్లో కీలక నేతగా ఎదిగి, మమతా బెనర్జీకి అత్యంత సన్నిహితుడిగా గుర్తింపు పొందిన ఆయన, తరువాత పార్టీని వీడి బీజేపీలో చేరారు. ఇప్పుడు అదే నాయకురాలిని ఆమె బలమైన కోటలో ఓడించడం, బెంగాల్ రాజకీయాల్లో శక్తి సమీకరణాలు ఎలా మారుతున్నాయో స్పష్టంగా చూపిస్తోంది. భవానీపూర్ నియోజకవర్గం 2011 నుంచి మమతా బెనర్జీకి అప్రతిహత విజయాలను అందించిన స్థలం. 2021 ఉపఎన్నికల్లో కూడా ఆమె భారీ మెజారిటీతో గెలిచి తన ఆధిపత్యాన్ని కొనసాగించారు. అయితే ఈసారి పరిస్థితులు పూర్తిగా భిన్నంగా మారాయి. ఎన్నికల సమయంలో జరిగిన తీవ్ర ప్రచారం, వ్యూహాత్మక మార్పులు, ఓటర్ల మనోభావాల్లో వచ్చిన మార్పు కలిసి ఫలితంపై ప్రభావం చూపినట్లు భావిస్తున్నారు. ఇది 2021లో జరిగిన నందిగ్రామ్ పోటీని గుర్తు చేస్తోంది. అప్పుడూ అధికారి మమతాపై గెలిచి సంచలనం సృష్టించారు. ఇప్పుడు భవానీపూర్‌లోనూ అదే తరహా ఫలితం రావడం, ఆయన రాజకీయ స్థాయిని మరింత బలపరిచింది. ఈ విజయం కేవలం వ్యక్తిగత గెలుపుగా కాకుండా, బీజేపీకి తూర్పు భారతంలో పెరుగుతున్న ప్రాభవానికి సూచికగా కూడా భావిస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో బెంగాల్ రాజకీయాల్లో కొత్త దిశ ఏర్పడే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. టీఎంసీకి ఇది హెచ్చరికగా మారగా, బీజేపీకి ఇది భవిష్యత్ ఎన్నికలకు బలమైన పునాది కావొచ్చు. మొత్తం మీద, భవానీపూర్ ఫలితం రాష్ట్ర రాజకీయ సమీకరణాలను మలుపుతిప్పే కీలక ఘట్టంగా నిలిచింది.

## వేములవాడలో శ్రీ భీమేశ్వర స్వామి దర్శనం చేసుకున్న జిల్లా కలెక్టర్

**జయభేరి, రాజన్న :**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామివారిని కరీంనగర్ జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన కలెక్టర్ ఆలయ అర్చకులు, వేద పండితులు సంప్రదాయ పద్ధతిలో ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. స్వామివారి మండపంలో కలెక్టర్ స్వామిఅమ్మవార్ల శేషవస్త్రం, లడ్డు ప్రసాదం, ఆశీర్వచనం అందించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ జి. అశోక్ కుమార్, ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఓటర్ విలక్షణ తీర్పు



అధికారంలో ఉన్న పార్టీలు.. అభివృద్ధిని చేసి చూపించాలి. అంతేగానీ.. సంక్షేమ పథకాలు ఇస్తే సరిపోదు. ప్రజలు అలాంటి పార్టీలను తిరస్కరిస్తున్నారు బెంగాల్‌లో మోదీ ఎన్నికలకు ముందు.. మహిళల అకౌంట్లలో మనీ వేశారు. దాంతో మహిళల ఓట్లు తమకే అనుకున్నారు. అడ్డంగా ఫెయిల్ అయ్యారు. ఏపీలో వైసీపీ కూడా పథకాల ద్వారా గెలుస్తామని అనుకుంది. ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారు. తమిళనాడులో డీఎంకే కూడా ఇలాగే దెబ్బపోయింది. తెలంగాణలో బీఆర్ఎస్ కంటే.. ఎక్కువ పథకాలను ప్రకటించిన కాంగ్రెస్‌ని ప్రజలు గెలిపించారు. ఏపీలోనూ అదే జరిగింది. ప్రజలు పథకాలు ఎవరైనా ఇస్తారు.. ఎవరు ఎక్కువ ఇస్తే వారికే ఓటు అంటున్నారు. అదే సమయంలో.. పథకాలు మాత్రమే ఇస్తే, అలాంటి పాలనకు స్వస్తి పలుకుతున్నారు. అందువల్ల ఓటర్లను తక్కువ అంచనా వేసే పార్టీలకు షాకులు తప్పట్లేదు. తాజా ఫలితాలు ఇదే తెలియజేస్తున్నాయి. ప్రతీ రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీలు బలంగా ఉంటాయి. అవి జాతీయ పార్టీలను ఎట్టి పరిస్థితుల్లో అధికారానికి రానివ్వకుండా చూసుకుంటాయి. కానీ.. కొన్నేళ్లుగా ఈ పరిస్థితి మారుతోంది. ముఖ్యంగా కేంద్రంలో నరేంద్ర మోదీ సారథ్యంలో బీజేపీ, ఎన్డీయే సర్కార్ 2014లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రాంతీయ పార్టీలు గల్లంతవుతున్నాయి. ఇందుకు బీజేపీ వ్యూహాలు ఒక కారణమైతే, ఆ పార్టీల స్వయంకృత అపరాధాలు మరో కారణం. జమ్మూకాశ్మీర్‌లో ఎన్సీ, హర్యానాలో ఓడిశాలో బిజూ జనతా దళ్, పంజాబ్‌లో శిరోమణి అకాలీదళ్, బెంగాల్‌లో తృణమూల్, కర్ణాటకలో జేడీఎస్, మహారాష్ట్రలో శివసేన ఇలా ఎన్నో ప్రాంతీయ పార్టీలు.. తమ ఉనికిని కోల్పోతున్నాయి. అధికారానికి దూరమై, కనీసం ప్రతిపక్షాలుగా కూడా ప్రభావం చూపలేకపోతున్నాయి. ఇక కాంగ్రెస్ పార్టీ కూడా ప్రభావం చూపలేకపోతోంది. మరికొన్ని సందర్భాల్లో.. బీజేపీతో పొత్తు పెట్టుకున్న పార్టీలు బలహీనపడుతున్నాయి. ఇక్కడ బీజేపీ తన ఎదుగుదలకు పునాదిని నిర్మించుకుంటోంది. అది ఆ పార్టీలకు సమస్య అవుతోంది. కచ్చితమైన విధానాలు, సిద్ధాంతాలు, పట్టుదల, బలమైన వ్యూహాల వంటివి కమలం ఎదుగుదలకు కారణం అవుతున్నాయి. మొన్నటిదాకా బీహార్‌లో బలంగా ఉన్న జేడీయూ.. ఇప్పుడు బీజేపీకి అధికారాన్ని అప్పగించుకుంది. ఐతే.. సౌత్‌లో మాత్రం బీజేపీ పెనట్రేట్ అవ్వలేకపోతోంది. కర్ణాటక తప్పితే.. మిగతా రాష్ట్రాల్లో ప్రభావం చూపలేకపోతోంది. భాషా ప్రాంతీయతా భావం ఇక్కడ బలంగా ఉండటం కమలానికి సవాల్ అవుతోంది. అయినప్పటికీ.. దేశవ్యాప్తంగా ఆ పార్టీ విస్తరిస్తున్న తీరు మాత్రం.. సంచలనమే. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో మనం ఒక కొత్త విషయాన్ని గ్రహించవచ్చు. ఏపీలో జనసేన పార్టీ ఒంటరిగా పోటీ చెయ్యకుండా.. టీడీపీతో కూటమిగా పోటీ చేసి.. గ్రాండ్ సక్సెస్ అయ్యింది. ఈ పొత్తు వల్ల ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలలేదు. కానీ తమిళనాడులో విజయ్ ఇలా చెయ్యలేదు. ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోలేదు. దాంతో.. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలినా.. ఎక్కువ ఓట్లు తనకే దక్కేలా చేసుకున్నారు. ఫలితంగా సింగిల్ లార్జెస్ట్ పార్టీగా ఇప్పుడు టీవీకే అవతరించింది. మెజార్టీ మార్క్ రాకపోయినా.. మరో 10 సీట్లతో పవర్ లోకి వచ్చేయవచ్చు. ఇందుకోసం చిన్న చిన్న పార్టీలతో పొత్తు పెట్టుకోవచ్చు. ఇలా ఒంటరిగా పోటీ చేసి బలమైన పార్టీగా ఎదగడం వల్ల ఇప్పుడు టీవీకే.. సొంతంగా అధికారంలోకి వచ్చే పరిస్థితిని తెచ్చుకుంది. ఈ ఛాన్స్ జనసేన తెచ్చుకోలేకపోయింది. ఏపీలో ఇప్పుడు జనసేన.. రెండో పెద్ద పార్టీగా ఉంది. కానీ.. టీడీపీతో పోల్చితే.. జనసేనకి ఉన్నవి 21 సీట్లే. నెక్స్ట్ ఎన్నికల్లో ఆ పార్టీ బలంగా ఎదగాలంటే.. ఒంటరిగా పోటీ చెయ్యాల్సి ఉంటుంది. కానీ.. 15 ఏళ్లు పొత్తుతోనే వెళ్తామని చాలాసార్లు డీసీఎం పవన్ కళ్యాణ్ చెప్పారు.
అలా పొత్తుతో వెళ్లినంతకాలం.. జనసేన ఎదిగే అవకాశాలు ఉండవు. సీట్ల సర్దుబాటులో.. కొన్ని సీట్లతోనే సర్దుకోవాల్సి ఉంటుంది. అలాగే పవన్ కళ్యాణ్ సీఎం అయ్యే చాన్స్ కూడా మిస్సవుతుంది. అందుకే విజయ్.. ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోకుండా.. ఇప్పుడు సీఎం అయ్యే ఛాన్స్ పొందారు. ఇదే జనసేనకి మైనస్ అవుతుంటే.. విజయ్‌కి ప్లస్ అయ్యింది. అఫ్‌కోర్స్ తమిళ పాలిటిక్స్ వేరు, మన ఏపీ పాలిటిక్స్ వేరు.. కానీ పరిస్థితులు అలా అయ్యాయని అనుకోవచ్చువిజయ్ వంటి కొత్త నాయకుడు రాజకీయాల్లోకి అడుగుపెట్టడం, ఆయన పార్టీకి వచ్చిన ఆధిక్యాలు చూస్తే, సహజంగానే అందరి దృష్టి పడింది. దీని నుంచి అనుభవజ్ఞులైన నాయకులు సైతం గమనించగల కొన్ని విస్తృత రాజకీయ పాఠాలు ఉన్నాయి.ముఖ్యమైన పాఠాలలో ఒకటి కథనం, భావోద్వేగ అనుబంధ శక్తి. విజయ్ పట్ల ఆదరణకు కారణం, సంవత్సరాల తరబడి జాగ్రత్తగా తీర్చిదిద్దుకున్న తెరపై ఆయన ఉనికి. ఇది పెద్ద సంఖ్యలో మద్దతుదారులతో ఒక సిద్ధమైన భావోద్వేగ బంధంగా రూపాంతరం చెందింది. సినిమాల్లో ఆయన చెడును ప్రశ్నించే ధోరణి.. ప్రభుత్వాలకు ముఖ్యంగా బీజేపీకి వ్యతిరేకంగా నడుచుకునే ధోరణి.. ప్రాంతీయ తత్వం, ద్రవిడ వాదాన్ని బలపరిచింది.
బీజేపీని వ్యతిరేకించేవారికి.. విజయ్ బలమైన సపోర్టర్‌గా నిలిచాడు.మరొక అంశం ప్రసంగాలు. విజయ్ ప్రసంగాలన్నీ దూకుడుగా, సూటిగా, సుత్తిలేకుండా సాగాయి. అలాగే.. ప్రభుత్వాన్ని దుమ్మెత్తిపోశాయి. పూర్తిగా డీఎంకేని బలంగా టార్గెట్ చేశారు. దాంతో డీఎంకేని వ్యతిరేకించేవారికి.. విజయ్.. బలమైన ఆల్టర్నేట్‌గా కనిపించాడు. అదే సమయంలో అన్నాడీఎంకే.. అంతర్గత కల్లోలాలతో.. బలమైన నాయకత్వాన్ని ప్రజలకు చూపలేకపోయింది. దీంతో.. ప్రభుత్వ వ్యతిరేక ఓటు.. టీవీకేకి షిఫ్ట్ అయ్యింది.మన తెలుగు రాష్ట్రాల్లో అభిమానులు.. ఓట్లు వేస్తారనే గ్యారెంటీ లేదు. ఈ కారణంగానే ఇదివరకు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్.. రెండుచోట్ల పోటీ చేసి కూడా ఓడిపోయారు. ఆ తర్వాత ఈ లోటును గుర్తించిన ఆయన.. 2024 అసెంబ్లీ ఎన్నికల సమయంలో.. అభిమానులను.. అభిమానం కాదు.. ఓటు వెయ్యాలి అని పదే పదే చెప్పడం వల్ల.. 100 శాతం స్ట్రైక్ రేటును సాధించగలిగారు. తమిళనాడులో తీరు వేరు అక్కడి ప్రజలు.. సినీ నేతలను విపరీతంగా అభిమానిస్తారు. అందువల్ల ఎన్నికల్లో పాల్గొనగానే.. బలంగా గెలిపిస్తారు. ఇది విజయ్‌కి బాగా సెట్ అయ్యింది.విజయ్ ఈ గెలుపు.. 27 నెలలది మాత్రమే కాదు. కొన్నేళ్లుగా ఆయన నిర్మించుకున్న అభిమాన సౌధానికి ఇది ప్రతిఫలం లాంటిది.
బీజేపీకి వ్యతిరేకంగా ఆయన వినిపించిన వాణికి ఇది ప్రాంతీయ భాషా సపోర్టర్ల నుంచి వచ్చిన సపోర్టు లాంటిది. ఇలా విజయ్ వ్యక్తిత్వం, నాయకత్వం, మాట్లాడే తీరు, నడుచుకునే వ్యవహార శైలి అన్నీ కలిసి.. ఈ విజయం దక్కేలా చేశాయి. మరో వైపు 2024 లోక్‌సభ ఎన్నికల్లో మెజార్టీ మార్క్ రాక, 240 సీట్లకే పరిమితమైన బీజేపీ.. ఆ తర్వాత పుంజుకున్న విధానం ఓ చరిత్ర. వరుసపెట్టి మహారాష్ట్ర, హర్యానా, ఢిల్లీ ఇలా చాలా రాష్ట్రాల్లో అధికారంలోకి వస్తూ.. ఇప్పుడు 42 లోక్ సభ స్థానాలున్న బెంగాల్‌ని తమ సొంతం చేసుకుంది. అలాగే.. అసోం, పుదుచ్చేరిలో పట్టు నిలుపుకుంది. ఇది బీజేపీకి పెద్ద బూస్ట్. కమలానికి ఇదెలా సాధ్యమవుతుంది అంటే.. సింపుల్ ఆన్సర్ ఉంది. మిషన్ మోడ్. మిగతా పార్టీలు ఎన్నికలు వచ్చినప్పుడే.. మిషన్ మోడ్‌లో ఉంటాయి. బీజేపీ అలా కాదు.. ఎప్పుడూ అలాగే ఉంటుంది. చిన్న ఎన్నికను కూడా ఆ పార్టీ తేలిగ్గా తీసుకోదు. దేశమంతా తామే విస్తరించాలనే బలమైన కోరిక ఆ పార్టీని ముందుకు నడిపిస్తోంది. దానికి తోడు బలమైన సైద్ధాంతిక పునాది, హిందుత్వ వాదం, దేశభక్తి.. ఇవన్నీ కలిసి.. ఆ పార్టీని మిషన్ మోడ్‌లో ఉంచున్నాయి. వీటికి తోడు ప్రధాని మోదీ, అమిత్ షా ద్వయం.. నిరంతరం వ్యూహాలు రచిస్తూ.. పార్టీని ముందుకు తీసుకెళ్తున్నారు. నెక్స్ట్ తెలంగాణపై కమలం ఫోకస్ ఉండటంతో.. ఇక్కడి స్థానిక పార్టీల్లో ఇది కొంత కలవరం కలిగించే అంశంగా చెప్పుకోవచ్చు. ఐతే.. తెలంగాణలో బీజేపీ ఎదగగలదా అనేది అప్పుడే చెప్పలేం. ప్రస్తుతానికి తెలంగాణలో ఆ పార్టీ.. కాంగ్రెస్, బీఆర్ఎస్ తర్వాత మూడో స్థానంలో ఉన్నట్లు కనిపిస్తోంది. అందువల్ల టాప్‌కి చేరడం అంత తేలిక కాదు, అలాగని అసాధ్యమూ కాదు. ఇకపై తెలంగాణ పాలిటిక్స్ మరింత ఉద్ధృతంగా ఉండటం ఖాయమనుకోవచ్చు.

## కేరళం సారథులకు అభినందనలు

వ్యక్తిగతంగా, కేరళ ఎన్నికల ప్రచార పర్వంలో నాపై అపారమైన అభిమానాన్ని కురిపించి, నిరుపమానమైన సోదరభావాన్ని చాటుకున్న యూడీఎఫ్ నాయకులకు, మద్దతుదారులకు, కేరళ ప్రజలకు నా హృదయపూర్వక ధన్యవాదాలు. అభ్యుదయ భావజాలం, , ప్రజాస్వామ్య స్ఫూర్తిని పుణికిపుచ్చుకున్న మన రెండు రాష్ట్రాలు దేశానికే ఆదర్శమని అన్నారు.అభివృద్ధిని శ్వాసించే మనం, దశాబ్ద కాలపు వంచనను, నిరాశానిస్పృహలను పారద్రోలి... కాంగ్రెస్ సుపరిపాలనలో ఉజ్వల భవిష్యత్తు వైపు సాగే నవశకానికి నాంది పలకబోతున్నమని అన్నారు.

**పదేళ్ల తర్వాత కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమికి పట్టం**

కేరళం ఓటర్లు ఎగ్జిట్ పోల్స్ అంచనాలను నిజం చేశారు. వరుసగా మూడోసారి అధికారం చేపట్టి రికార్డ్ సృష్టించాలని భావించిన LDFకు గట్టి షాక్ ఇచ్చారు. పదేళ్ల తర్వాత కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమికి పట్టం కట్టారు. 2024 లోక్‌సభ ఎన్నికలు, ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలతో ఆత్మవిశ్వాసంతో ఉన్న యూడీఎఫ్ 82 స్థానాల్లో విజయం సాధించి మ్యాజిక్ ఫిగర్ను దాటేసింది. తద్వారా పదేళ్ల అధికార పీఠాన్ని దక్కించుకుంది. కేరళంలో కాంగ్రెస్ గెలవడానికి కారణాలు ఏంటి? ఇప్పుడు తెలుసుకుందాం.

**ప్రభుత్వ వ్యతిరేకత**

పదేళ్ల పాటు అధికారంలో ఉంటే సాధారణంగానే ప్రజల్లో ప్రభుత్వ వ్యతిరేకత ఉంటుంది. గత ఎన్నికల్లో అధికార మార్పిడి సంప్రదాయానికి చెక్ పెడుతూ రెండోసారి ఎల్డీఎఫ్ కూటమికి పట్టం కట్టారు కేరళ వాసులు. ఫలితంగా 2016 నుంచి ఇప్పటి వరకు దాదాపు పదేళ్లు పాలించారు. దీర్ఘకాలం అధికారంలో ఉండడంతో ఎల్డీఎఫ్ కూటమిపై ఉన్న ప్రభుత్వ వ్యతిరేకత యూడీఎఫ్ కూటమికి బాగా కలిసివచ్చింది. ఎన్నికల సమయంలోనే ఎల్డీఎఫ్పై ఓటర్లలో వ్యతిరేకత స్పష్టంగా కనిపించింది. మార్పు కావాలంటూ యూడీఎఫ్ బలంగా ప్రచారం చేసి ప్రజల్లోకి తీసుకెళ్లింది.

**నిరుద్యోగం, జీవన వ్యయం పెరుగుదల, ఉద్యోగులకు జీతాల ఆలస్యం**

ఎల్డీఎఫ్ ప్రభుత్వ సమయంలో ప్రజల్లో నిరుద్యోగం, జీవన వ్యయం పెరుగుదల, ఉద్యోగులకు జీతాల ఆలస్యం లాంటివి తీవ్ర ప్రభావం చూపాయి. పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, వ్యవసాయ సంక్షోభం వంటి సమస్యలను ప్రతిపక్షం బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లింది. ఉద్యోగులకు జీతాల ఆలస్యం ఇవ్వడం వల్ల ప్రభుత్వ ఉద్యోగులు సైతం ఎల్డీఎఫ్కు వ్యతిరేకంగానే ప్రచారం చేశారు.

**మైనారిటీ ఓట్ల పోలరైజేషన్**

కేరళలో ఏ పార్టీ అధికారంలోకి రావాలన్నా క్రైస్తవ, ముస్లిం ఓటర్ల వర్గాలే కీలక పాత్ర పోషిస్తాయి. ముఖ్యంగా ముస్లింల్లో మంచి పట్టు ఉన్న ముస్లిం లీగ్ (IUML) పార్టీ యూడీఎఫ్ కూటమిలో ఉండడంతో బాగా కలిసివచ్చింది. రెండు ప్రధాన పార్టీలు కలిసి పోటీ చేయడంతో ఓట్లు చీలకుండా జాగ్రత్తపడ్డారు. ఫలితంగా మెజార్టీ స్థానాల్లో యూడీఎఫ్ విజయాన్ని సాధించిందని విశ్లేషకులు అంటున్నారు.

**వరుస ఎన్నికలతో యూడీఎఫ్లో జోష్**

అసెంబ్లీ ఎన్నికల ముందు జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా UDF అదరగొట్టింది. UDF బలమైన తిరుగుబాటు చేసి, అనేక పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు గెల్చుకోవడం అసెంబ్లీ ఎన్నికలకు మరితం ఊపిచ్చింది. అంతకుముందు జరిగిన 2024 లోక్‌సభ ఎన్నికల్లో కూడా యూడీఎఫ్ మెజారిటీ స్థానాలను కైవసం చేసుకుంది. ఇలా వరుస ఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమి రెట్టింపు ఉత్సాహంతో పనిచేసి విజయం దిశగా అడుగులు వేసింది. పదేళ్ల పాటు ప్రతిపక్షంలో కూర్చున్న యూడీఎఫ్ కూటమి ఈసారి ఎలాగైనా గెలవాలనే లక్ష్యంగా పనిచేసింది. అంతర్గత విబేధాలను పక్కకుపెట్టి అన్ని పార్టీలు సమన్వయంతో పనిచేశాయి.

**మేనిఫెస్టో హామీలు, రాహుల్ గాంధీ ప్రచారం**

కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ గెలుపులో మేనిఫెస్టో కీలక పాత్ర పోషించింది. సంక్షేమ హామీలతో పాటు పరిపాలన సంస్కరణలతో కూడిన మేనిఫెస్టోను రూపొందించింది. ఇందులో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, కళాశాలకు వెళ్లే బాలికలకు నెలకు రూ. 1,000 సహాయం, రూ. 3,000 సంక్షేమ పింఛను, కుటుంబానికి రూ. 25 లక్షల వరకు ఉచిత ఆరోగ్య బీమా, యువ పారిశ్రామికవేత్తలకు రూ. 5 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు ఇస్తామని హామీలు ప్రజలను ఆకర్షించాయి. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రచారం కూడా కలిసివచ్చింది.

## పాలమూరు నుంచే తొలి అడుగు

అన్నట్టుగానే ఈనెల 8న ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా నుంచి కృష్ణా జలాల సాధనకు శంఖారావం పూరించనున్నారు. 8న ఉదయం జోగులాంబ అమ్మవారిని దర్శనం చేసుకోనున్న కవిత అదే రోజు సాయంత్రం పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టులో ప్రతిపాదించిన కేపీ లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ సమీపంలోని చౌదరిగూడెం వద్ద బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు. టీఆర్ఎస్ పార్టీ స్థాపించిన తర్వాత తన మొదటి ప్రాధాన్యతగా కృష్ణా జలాల సాధనకు శ్రీకారం చుట్టారు. ఈనెల 8న చౌదరిగూడెం వద్ద "పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు సాధన సభ" నిర్వహించనున్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సాధించుకుని 12 ఏళ్లు గడిచిన తర్వాత కూడా కృష్ణా జలాల వినియోగంలో తెలంగాణ వెనుకబడి ఉండటానికి పాలకుల లోపభూయిష్ట విధానాలే కారణమని పలు వేదికలపై నుంచి కవిత స్పష్టం చేశారు. కృష్ణా, గోదావరి నీళ్లను సమర్థవంతంగా వినియోగించుకుంటూ మన బీళ్లకు మళ్లించుకునేందుకు తమ వద్ద స్పష్టమైన విధానాలు ఉన్నాయని కూడా ప్రకటించారు. ఈ క్రమంలోనే కృష్ణా నీళ్ల సాధన కోసం ఉద్యమ కార్యాచరణ ప్రకటించే దిశగా అడుగులు వేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొదట శంకుస్థాపన చేసిన పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు 11 ఏళ్లు గడిచిన తర్వాత కూడా 50 పనులు పూర్తి చేయకపోవడంపై "జనంబాట" కార్యక్రమంలో ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచి ప్రాజెక్టుకు సత్వర అనుమతులు సాధించడంతో పాటు పనులు వేగంగా పూర్తి చేయించడానికి ఉద్యమ ప్రణాళిక ప్రకటించే దిశగా కవిత అడుగులు వేస్తున్నారు. తెలంగాణకు హక్కుగా దక్కే ప్రతి చుక్క నీటిని మన బీడు భూములకు మళ్లించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

## అవినీతి ఆరోపణలపై కమిషన్

వాస్తవ ధరలతో పోలిస్తే భారీగా హెచ్చుతగ్గులున్న భూముల ధరలను క్రమబద్ధీకరించాలని మంత్రివర్గం నిర్ణయించింది. మార్కెట్ విలువల రేషనలైజేషన్ చేయడానికి రిజిస్ట్రేషన్ శాఖకు అనుమతి ఇవ్వడం జరిగింది. ఈనెల చివరి వారంలో సవరించిన విలువలు అమల్లోకి వచ్చేలా నిర్ణయించింది.వివిధ ప్రాజెక్టులు, అభివృద్ధి పనులు, రోడ్ల విస్తరణ పనులు జరుగుతున్న ప్రాంతాల్లో భూములు కోల్పోతున్న నిర్వాసితులు ఇప్పుడు ప్రభుత్వం చెల్లించే పరిహారం రేట్లపై అసంతృప్తితో ఉండటమే కాకుండా, ధరలు పెంచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తులను ప్రభుత్వం పరిశీలించింది. దాంతో పాటు మార్కెట్ ధరలకు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మధ్య భారీ వ్యత్యాసం ఉన్న నేపథ్యంలో శాస్త్రీయ పద్ధతిలో ధరలను సవరించడానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. భూముల ధరలు పెరిగేలోపు HILT పాలసీలో దరఖాస్తు చేసుకునే వారికి కూడా ఒక అవకాశం ఇవ్వాలని మంత్రివర్గం భావించింది. దరఖాస్తు చేసుకున్న వారికి ఇప్పుడున్న ధరల మేరకు ముందుగా 10 శాతం చెల్లించే వెసులుబాటు కల్పించి, మిగతా 90 శాతం 90 రోజుల్లో చెల్లించే విధంగా నిర్ణయించింది. రాష్ట్రంలోని అన్ని ఐటీఐలు, పాలిటెక్నిక్ కాలేజీలు, TSATnetwork ఇకనుంచి YoungIndiaSkillsUniversity పరిధిలోకి తెచ్చి ఒకే గొడుగు నిర్వహించాలని నిర్ణయించింది. ల్గొండ రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల సంఘాన్ని నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డుకు అప్పగించే ఎంఓయూకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీంతో నల్గొండ రంగారెడ్డి మిల్క్ ప్రొడ్యూసర్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ కు సంబంధించిన పాలు, పాల ఉత్పత్తులకు సంబంధించి డైరీ ప్లాంట్ నిర్వహణ, ప్రాసెసింగ్, మార్కెటింగ్ ఎన్డీబీ నిర్వహిస్తుంది. Telangana లో 9 ఉమ్మడి జిల్లాల్లో 33/11 కేవీ సబ్ స్టేషన్ల సమీపంలో సోలార్ పవర్ జనరేషన్ ప్లాంట్ల ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. పైలెట్ ప్రాజెక్టుగా 18 చోట్ల ఈ సోలార్ జనరేషన్ ప్లాంట్లను ఏర్పాటు చేయనుంది. దాదాపు రూ.66.50 కోట్లతో 19 మెగావాట్ల #Solar ప్రాజెక్టులను అమలు చేసేందుకు ఆమోదం తెలిపింది. CURE పరిధిలోని గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్లలో వివిధ ప్రభుత్వ కార్యాలయాలు పెండింగ్‌లో ఉన్న పన్నులను క్లియర్ చేసుకోవడానికి వీలుగా వన్ టైమ్ సెటిల్‌మెంట్ (OTS) వెసులుబాటు కల్పించే ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్‌లో ఆధునిక కూరగాయల మార్కెట్ కోసం 42 ఎకరాల భూమి కేటాయిస్తూ మంత్రివర్గం ఆమోదం తెలిపింది.



# విజయ్ ఇంటికి త్రిష

✍ జయభేరి, చెన్నై, మే 4 :

తమిళనాడు ఎన్నికల్లో దళపతి విజయ్ పార్టీ స్పష్టమైన మెజార్టీ దిశగా దూసుకెళ్తోంది. దీంతో ఆ పార్టీ కార్యకర్తలు, అభిమానులు సంబరాల్లో మునిగితేలారు. ఆయన ఇంటి వద్ద పోలీసులు భారీ భద్రత కల్పించారు. అభిమానులు, కార్యకర్తల కోలాహలంతో విజయ్ ఇంటి బయటకు వచ్చి వారికి అభివాదం చేసి మళ్లీ లోపలికి వెళ్లిపోయారు. టీవీకే గెలుపు నేపథ్యంలో హీరోయిన్ త్రిష విజయ్ ఇంటికి వెళ్లారు.సోమవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న హీరోయిన్ త్రిష... తిరుపతి నుంచి నేరుగా విజయ్ నివాసానికి చేరుకున్నారు. తిరుమల శ్రీవారి ప్రసాదాన్ని ఆయనకు అందజేశారు. దాదాపు గంట పాటు విజయ్‌తో చర్చలు జరిపారు. ఆ తర్వాత బయటకు రాగానే మీడియా ప్రతినిధులు ఒక్కసారిగా ఆమె కారును చుట్టుముట్టారు. ఎన్నికల్లో ఆమె ఇండైరెక్ట్‌గా విజయ్ పార్టీకి సపోర్ట్ చేశారు. సోమవారం ఆమె బర్త్ డేతో పాటు ఎన్నికల ఫలితాలు కావడంతో వెంకటేశుని దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. మరోవైపు, విజయ్ ఇంట్లో కుటుంబ సభ్యులు సంబరాల్లో మునిగితేలారు. విజిల్ వేస్తూ ఎంజాయ్ చేశారు. ప్రస్తుతం ఈ వీడియోలు వైరల్ అవుతున్నాయి.గత కొంతకాలంగా విజయ్, త్రిష వార్తల్లో నిలిచిన సంగతి తెలిసిందే. టీవీకే ఎన్నికల ఫలితాల వేళ వీరిద్దరి పేర్లు సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్నాయి. విజయ్‌తో త్రిష రిలేషన్ రూమర్స్ గత కొద్ది రోజులుగా పెద్ద ఎత్తున హల్చల్ చేశాయి. డివోర్స్ వ్యవహారం తర్వాత త్రిష, విజయ్ ఒకే ఈవెంట్‌లో కలిసి కనిపించడం ఈ వార్తలకు మరింత బలం చేకూర్చింది. ఎన్నికల టైంలో ఇన్ స్టా వేదికగా ఆమె విజయ్ గెలుపును ఆకాంక్షించారు. సోమవారం తన బర్త్ డే సందర్భంతో పాటు ఎన్నికల ఫలితాలు కూడా ఉండడం వల్లే త్రిష తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారని నెటిజన్లు చర్చించుకుంటున్నారు. మరోవైపు, నిర్మాత బండ్ల గణేష్... 'వెంకటేశుని ఆశీస్సులతో మీ డ్రీమ్స్ నిజమయ్యాయి.' అంటూ కంగ్రాట్స్ చెప్పడం వైరల్ అయ్యింది. హీరోయిన్ త్రిష తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఇవాళ ఆమె పుట్టిన రోజు సందర్భంగా సోమవారం వేకువజామున స్వామిని దర్శించుకున్నారు. సుప్రభాత సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అధికారులు ఆమెకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయం వెలుపల ఆమెను చూసేందుకు, సెల్ఫీలు దిగేందుకు అభిమానులు పోటీ పడ్డారు.ఆలయం వెలుపల అభిమానులతో ఫోటోలు దిగుతుండగా... ఓ ఫ్యాన్ 'రిజల్ట్ పక్కా మనదే మేడమ్' అంటూ అరవగా త్రిష నవ్వుతూనే ఎక్స్‌ప్రెషన్ ఇచ్చారు. అంతకు ముందు ఇన్ స్టా వేదికగా తాను తిరుపతికి వెళ్తున్నట్లు హైవేపై తిరుపతి బోర్డ్ ఉన్న ఫోటోను షేర్ చేశారు. దీంతో నెటిజన్లు ఆమె బర్త్ డే సందర్భంగా తిరుమలకు వెళ్తున్నట్లు కామెంట్ చేశారు. కొందరు మాత్రం ఇవాళ తమిళనాడు ఎన్నికల ఫలితాలు కావడంతో విజయ్ గెలుపు కోసం ఆమె కోరుకున్నట్లు చర్చించుకుంటున్నారు...



## పాక్సో కేసుల విచారణ

✍ జయభేరి, హయత్‌నగర్ :

హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన క్రైం నెం. 65/2022, యు/ఎస్ 354 ఐపీసీ, సెక్షన్ 11 & 12 పాక్సో చట్టం, ఎస్.సి నెం. 611/2022 కేసులో, ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ జడ్జి (రేప్, పాక్సో కేసుల త్వరిత విచారణ కోసం), రంగారెడ్డి జిల్లా, ఎల్.బి. నగర్ న్యాయస్థానం, తేదీ 04.05.2026 నాడు తీర్పు వెలువరించారు. ఈ కేసులో నిందితుడు గుల్దాన్ సహాని (22), తండ్రి రాధేశ్యామ్, వృత్తి పెయింటింగ్ పని, నివాసం గోపిటోలా టెలియా గ్రామం, పాక్డినౌని పోలీస్ స్టేషన్, మహారాజ్‌గంజ్ జిల్లా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందినవాడు, దోషిగా తేల్చబడి 5 సంవత్సరాల కారాగార శిక్షతో పాటు రూ. 5,000/ జరిమానా విధించబడింది. అదేవిధంగా బాధితురాలికి రూ. 1,50,000/ పరిహారం మంజూరు చేయబడింది. ఈ విషయాన్ని హయత్‌నగర్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ పి. నగరాజు గౌడ్ తెలియజేశారు.

## రూ.లక్ష లంచం తీసుకుంటూ పట్టుబడిన జూనియర్ అసిస్టెంట్



✍ జయభేరి, బోరబండ :

రూ.లక్ష లంచం తీసుకుంటూ ఓ అవినీతి అధికారిని ఏసీబీకి పట్టుబడింది. బోరబండ GHMC ఆఫీసులో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న శ్రీలత ఇంటి నిర్మాణ అనుమతి ఫైల్ క్లియర్ చేసేందుకు బాధితుడి నుండి రూ.5 లక్షల లంచం డిమాండ్ చేసింది. అందులో భాగంగా రూ.లక్ష తీసుకుంటుండగా ACB అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆమెను అరెస్టు చేసి, కేసు నమోదు చేశారు.

# నిరుపేద రైతుకు కన్నీళ్లు

- నేను బ్రతికే ఉన్నా.. నా భూమిని ఎలా మాయం చేస్తారు..
- తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతు కుటుంబ సభ్యులు.
- పూర్తి రికార్డులు పరిశీలించి ఇస్తాం : తహసీల్దార్

✍ జయభేరి, ఫరూక్ నగర్ :










తాను బ్రతికే ఉన్నప్పటికీ, తన పేరిట ఉండాల్సిన భూమిని అక్రమంగా ఇతరుల పేరిట మార్చేశారని ఓ రైతు గొల్లుమన్నాడు. న్యాయం కోసం భార్యాబిడ్డలతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగిన ఘటన ఫరూక్ నగర్ మండల కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది.

**ఘటన వివరాల్లోకి వెళ్తే..**

ఫరూక్‌నగర్ మండలం మొగిలిగిద్ద గ్రామానికి చెందిన మైస బలయ్య తండ్రి పోచయ్య ఒక సాధారణ నిరుపేద రైతు. ఎలికట్ట శివారులో ఆయనకు పూర్వీకుల నుండి వచ్చిన భూమి ఉంది. సర్వే నెంబర్ 483లో 29 గుంటలు, సర్వే నెంబర్ 484లో ఒక ఎకరా 14 గుంటలు.. మొత్తంగా సుమారు రెండు ఎకరాల పొలం బలయ్య పేరిట రికార్డుల్లో ఉండేది. అయితే 2005 వరకు తన పేరిట ఉన్న భూమిని దొంగ పత్రాలు సృష్టించి నా భూమిని కాజేశారని ఆరోపించారు. కొంత కాలం క్రితం భూమి వివరాలను పరిశీలించగా, తన పేరుకు బదులు ఇతరుల పేర్లు ఉండటం చూసి సదరు రైతు దిగ్భ్రాంతికి గురయ్యాడు. అనంతరం కోర్టులో కేసు వేశామని, ప్రస్తుతం తమ భూమిని కబ్జా చేసిన వ్యక్తులు ఇతర పనులు చేస్తున్నారని, వారిని అడ్డుకోకపోతే తమని చంపేస్తామని బెదిరిస్తున్నారని రైతు బాలయ్య ఆవేదన వ్యక్తం చేశారు.

**భూ కబ్జాపై రైతు ఆవేదన..**

నేను కళ్లముందే కనిపిస్తున్నా.. కానీ రికార్డుల్లో మాత్రం నా భూమిని మాయం చేశారు. భూమిపై కోర్టులో కేసు నడుస్తున్నప్పటికీ, నిబంధనలకు విరుద్ధంగా ఇతరుల పేరిట మార్పిడి ఎలా చేస్తారు? అని బలయ్య అధికారులను నిలదీశారు. కబ్జాదారులు తనను తన సొంత పొలంలోకి కూడా వెళ్లనివ్వడం లేదని, ప్రాణహాని తలపెడుతున్నారని ఆయన ఆరోపించారు. తమకు ఉన్నది ఆ కొద్దిపాటి భూమి మాత్రమేనని, అది కూడా పోతే తమ కుటుంబం రోడ్డున పడుతుందని కన్నీటి పర్యంతమయ్యారు. బాధితులు తహసీల్దార్ కార్యాలయం గేటు ముందు బైఠాయించి ఆందోళన చేయడంతో విషయం తెలుసుకున్న తహసీల్దార్ నాగయ్య బాధితులతో మాట్లాడారు. వారికి సంబంధించిన పత్రాలను పరిశీలించారు. రికార్డుల మార్పిడి ఎలా జరిగిందనే అంశంపై విచారణ జరుపుతామని, 2005 కంటే ముందు తరువాత రికార్డులు పూర్తిగా పరిశీలిస్తామని తహసీల్దార్ తెలిపారు. రెండు రోజుల్లో భూమికి సంబంధించిన అన్ని పాత రికార్డులు తనిఖీ చేస్తామన్నారు. ఎక్కడ తప్పు జరిగిందో గుర్తించి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు. తహసీల్దార్ హామీతో రైతు కుటుంబం ప్రస్తుతానికి శాంతించినప్పటికీ, తమకు భూమి దక్కకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని అన్నారు. ఉన్నతాధికారులు స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, తమ భూమిని తమకు అప్పగించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# చిల్కానగర్ డివిజన్ కి నిధుల వరద

- చిల్కానగర్ / బీరప్ప గడ్డ డివిజన్ లలో 1 కోటి 12 లక్షల రూపాయల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

✍ జయభేరి, ఉప్పల్ :



చిల్కానగర్, బీరప్ప గడ్డ డివిజన్లలో 1 కోటి 12 లక్షల రూపాయల వ్యయంతో పలు కాలనీలో బస్తీల్లో CC రోడ్ల అభివృద్ధి పనుల శంకుస్థాపనకు ముఖ్య అతిథులుగా ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి మాజీ కార్పొరేటర్ జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యురాలు బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. చిల్కానగర్ డివిజన్ అభివృద్ధికి 129 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామని అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పూర్తయిన గల్లీలలో సిసి రోడ్డు పనులు దశలవారీగా పూర్తి చేసుకుంటూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. అనంతరం మాజీ కార్పొరేటర్ గీతా ప్రవీణ్ మాట్లాడుతూ.. డివిజన్ అభివృద్ధికి సహకరిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ ఎలక్షన్ల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అభివృద్ధి పనుల ద్వారా తీర్చుకుంటూ ముందుకు సాగుతున్నామని తెలుపుతూ, ఉప్పల్ నియోజకవర్గం సాంక్షన్ చేయించిన ఎమ్మెల్యేకి హ్యాట్సాఫ్ అని ఇప్పటి వరకు ఎంతోమంది ఎమ్మెల్యేలు నియోజకవర్గంలో అయ్యారు కానీ ఎవరు కూడా వంద పడకల హాస్పిటల్ ని తెలియక పోయారని ఆ ఘనత కేవలం బండారి లక్ష్మారెడ్డికి దక్కిందని అన్నారు, అదేవిధంగా మల్లికార్జున్ నగర్ శివరే ఔట్లెట్ పనులను కూడా వీలైనంత తొందరలో సాంక్షన్ చేయించి పూర్తి చేస్తామని తెలిపారు. అదేవిధంగా హైకోర్టు కాలనీ హెచ్ఎంటి చెరువుకి 30 కోట్ల రూపాయల నిధులు శాంక్షన్ చేయించిన ఎమ్మెల్యే గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ డివిజన్లోని వైకుంఠధామాల గురించి కొత్త ప్రతిపాదనలు పెట్టామని వాటిని ఎమ్మెల్యే ద్వారా సాంక్షన్ చేయించి త్వరలో పనులు మొదలుపెడతామని తెలిపారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బస్తీ వాసులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.






## కాళీ కుర్చీలకు దరఖాస్తు అందజేత

✍ జయభేరి, జీడిమెట్ల :

జీడిమెట్ల సర్కిల్ పరిధిలోని డిప్యూటీ కమిషనర్ ఆఫీస్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు ఎవరు కూడా హాజరు కాలేదు. కాలనీలోని పలు సమస్యలపై వినతి పత్రాలు ఇద్దామని వెళ్లిన కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు, సభ్యులకు నిరాశ ఎదురయింది. దీంతో చేసేదేమీ లేక ఖాళీ కుర్చీలకు వినతి పత్రాన్ని అందజేసి నిరాశతో వెను తిరగడం జరిగింది. ప్రజావాణి నిర్వహించి ప్రజా సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కార దిశగా పనిచేయాల్సిన అధికారులు, ప్రజావాణిని నిర్వీర్యం చేయడాన్ని ప్రజలు తప్పుపడుతున్నారు ఇకనైనా అధికారులు తమ విధులను సక్రమంగా నిర్వహించాలని ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తుల వెంటనే పరిష్కరించాలని M. N రెడ్డి కాలనీ పేస్ 1 అసోసియేషన్ అధ్యక్షులు సూదుల సంపత్ గౌడ్ డిమాండ్ చేశారు లేనిచో భవిష్యత్తులో అధికారులు తీవ్ర పరిణామాలు ఎదురు చూడాల్సి ఉంటుందని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం



✍ జయభేరి, జవహర్ నగర్ :

జవహర్ నగర్ డంపింగ్ యార్డు తొలగింపును కోరుతూ గత పది రోజులుగా కొనసాగుతున్న నిరవధిక రీలే నిరాహార దీక్షలు విరమించబడ్డాయి. డంపింగ్ యార్డు వ్యతిరేక జేఏసీ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దీక్షలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ మేరకు ముగించారు. మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ జేఏసీ ప్రతినిధులకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింప చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, డంపింగ్ యార్డు సమస్యపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని, త్వరలోనే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో, తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ మెంబర్ గోగుల సరిత,కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ ముప్పు రామారావు, జేఏసీ ప్రతినిధులు శంకర్ నారాయణ, పద్మచారి, ఎనుగు సంజీవరెడ్డి, మారం సమ్మిరెడ్డి, గావిని స్వర్ణ శ్రీనివాస్, జవహర్ నగర్ మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్, మాజీ దమ్మైగూడ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, మాజీ సర్పంచ్ యాదగిరి గౌడ్, శంకర్ గౌడ్, కోటేష్ గౌడ్, దుర్గ ప్రసాద్ గౌడ్, మాజీ కౌన్సిలర్ సాయి, వినయ్. జేఏసీ ప్రతినిధులు, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## కాషాయ జెండా అఖండ విజయం



✍ జయభేరి, ఎల్బీనగర్ :

అస్సాం, వెస్ట్‌బెంగాల్, పుదుచ్చేరిలో భారతీయ జనతా పార్టీ ఘనవిజయం సాధించిన సందర్భంగా ఎల్బీనగర్ చౌరస్తా, ఎస్ కే డి నగర్ చౌరస్తా, సాహెబ్ నగర్ చౌరస్తాలో ఘనంగా విజయోత్సవ సంబరాలు నిర్వహించడం జరిగింది. ఈ సంబరాలలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కాసం వెంకటేశ్వర్లు, రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి, మేడ్చల్ జిల్లా ప్రబారి, ఎల్బీనగర్ అసెంబ్లీ ఇంచార్జ్ సామ రంగారెడ్డి, బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి, డివిజన్ అధ్యక్షులు విష్ణువర్ధన్ రావు పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అస్సాం, వెస్ట్ బెంగాల్ పుదుచ్చేరిలో కాషాయ జెండా రెపరెపలాడిందని, బిజెపి అఖండ విజయం దేశ అభివృద్ధి మోదీతోనే సాధ్యమని మరోసారి నిరూపితం చేయడం జరిగింది, రాబోయే కాలంలో తెలంగాణ గడ్డ పైన కూడా కాషాయ జెండా రెపరెపలాడుతుందని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు శ్రీధర్ రావు, రఘురాం నేత, శంకరయ్య గౌడ్, శేఖర్ గౌడ్, విష్ణు వర్ధన్ రెడ్డి, ప్రేమ్ నాథ్, ప్రభాకర్ రెడ్డి, భూపాల్ రెడ్డి, లక్ష్మారెడ్డి, మహేష్ గౌడ్, నారాయణ రావు, రవిశంకర్, శరత్ కుమార్, చిన్న యాదవ్, మధుసూదన్ రెడ్డి, వెంకట్ రెడ్డి, మహిళ నాయకురాలు దేవిక, ప్రసన్న, సౌమ్య, నాయకులు పీసపాటి శ్రీనివాస్, చిత్రంజన్, కిషోర్, శ్రీనివాసరావు, ప్రభాకర్ యాదవ్, రామకృష్ణ, సుధీర్ కుమార్, రాజేందర్ రెడ్డి, కాంతారావు, రాజేందర్, శబరి, కామేష్, మణిపాల్ రెడ్డి, వెంకటేష్, సురేష్ కుమార్, వినీల్, దిలీప్ గౌడ్, నాగేష్, సిద్దేశ్వర్, యోగి యాదవ్, ప్రదీప్ గౌడ్, సాయి శంకర్, నివాస్, చందు మరియు తదితరులు ఉన్నారు.

## ప్రేమ జంట ఆత్మహత్య

✍ జయభేరి, కడప :

కడపపట్టణం లో విషాదం నెలకొంది. ఒక ప్రేమికుల జంట ఆత్మహత్య చేసుకుంది. చెన్నూరు కు చెందిన హేమ శ్రీ,, యోగేంద్ర కుమార్ వర్మ లు కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. అనూహ్యంగా వేరువేరు చోట్ల ఆత్మహత్య చేసుకున్నారు. యోగేంద్ర వర్మ కడపలో తమ బంధువుల ఇంటి వద్ద, హేమశ్రీ చెన్నూరు లోని తన ఇంటి వద్ద ఉరి వేసుకున్నారు. ఇద్దరి మధ్య మనస్పర్థలతో ఆత్మహత్య చేసుకున్నట్టు సమాచారం. పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

# వైభవంగా కట్ట మైసమ్మ తల్లి బోనాలు

- అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన - ఎమ్మెల్యే

**జయభేరి, శామీర్ పేట్, మే 4:**




శామీర్‌పేట్ మండల కేంద్రంలోని శ్రీ కట్ట మైసమ్మ తల్లి జాతర వేడుకలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకలకు మాజీ మంత్రి మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు. ఆలయానికి చేరుకున్న మల్లారెడ్డికి జాతర నిర్వాహకులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు గ్రామ దేవతల జాతరలు ప్రతీకలని అన్నారు. ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో జరిగే జాతరలు సామాజిక ఐక్యతకు నిదర్శనమని, యువత కూడా మన సంస్కృతి సంప్రదాయాలను కొనసాగించాలని సూచించారు. ఇక నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని, సకాలంలో వర్షాలు కురిసి రైతుల కళ్లలో ఆనందం వెల్లివిరియాలని అమ్మవారిని వేడుకున్నట్లు ఆయన తెలిపారు. కాగా ఈ జాతర వేడుకలకు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. దీంతో ఆలయ పరిసరాలు భక్తజన సందోహంతో కళకళలాడాయి. మహిళలు బోనాలు, పూజా కార్యక్రమాలతో పాల్గొనగా, గ్రామ ప్రజలు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో గుడి చైర్మన్ భూమి రెడ్డి, మాజీ గుడి చైర్మన్ మహేందర్ యాదవ్,వంగ వెంకట్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ అనిత లాలయ్య,మాజీ ఎంపీటీసీ డప్పు సాయిబాబు,పవన్ ముదిరాజ్, నవీన్ ముదిరాజ్, విష్ణు, శంకర్ గౌడ్,మహిపాల్ రెడ్డి, కౌన్సిలర్ యూసఫ్ బాబా,స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## మున్సిపల్ కమిషనర్ కు శుభాకాంక్షలు తెలిపిన భాజపా నాయకులు

**జయభేరి, మేడ్చల్ :**

మేడ్చల్ జిల్లా ఎల్లంపేట్ మున్సిపాలిటీ నూతన మున్సిపల్ కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించిన కృష్ణారెడ్డి కి సోమవారం స్థానిక బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు. కమిషనర్ కార్యాలయాన్ని సందర్శించిన వారు కమిషనర్ కు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. మున్సిపాలిటీ అభివృద్ధి, పారిశుద్ధ్యం, మౌలిక వసతుల మెరుగుదల కోసం సమన్వయంతో పని చేయాలని కోరారు. ఈ సందర్భంగా కమిషనర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని, ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తానని తెలిపారు. ప్రజల సమస్యలను ప్రాధాన్యతగా తీసుకుని పరిష్కరించేందుకు కట్టుబడి ఉన్నానని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు జగన్ గౌడ్, దేవేందర్ రెడ్డి, పోచయ్య, శ్రీశైలం, శ్రీనివాస్, మహేష్ పలువురు ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

## నృత్య శిక్షణ సమ్మర్ క్యాంప్ ప్రారంభం



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ భవనం నందు అధ్యక్షుడు NVT నృత్య శిక్షణ సమ్మర్ క్యాంపు ని సభ్యులతో కలిసి ప్రారంభించినారు. వారు మాట్లాడుతూ ఈ నృత్య శిక్షణ సమ్మర్ క్యాంపు ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ కి ఎన్నో సంవత్సరాల నుండి నృత్య శిక్షణ ఇస్తున్న మాస్టర్స్ క్రాంతి మాస్టర్, రాక్ స్టార్ రమేష్ మాస్టర్, ఏడుకొండలు మాస్టర్, లావణ్య మాస్టర్, త్రివేణి మాస్టర్, జగన్ మాస్టర్, వీరితోపాటు ఎంతోమంది దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ భవనమునందు నృత్య శిక్షణ ఇస్తూ ఎంతోమందిని జిల్లాస్థాయి రాష్ట్రస్థాయి జాతీయ స్థాయి వరకు పోటీలలో పాల్గొనేటట్టు తయారు చేసినారు. అలాగే డి షోలో కూడా మన దేవరకొండ విద్యార్థులు పాల్గొనడం చాలా గర్వించదగ్గ విషయం అని, వారందరికీ దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ తరపున ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నానని అన్నారు. క్రీడాకారులకు కళాకారులకు కొదవలేని దేవరకొండలో ఇప్పటికీ ఇండోర్ అవుట్ డోర్ స్టేడియాలు లేకపోవడం ఉన్నవి అభివృద్ధిలోకి రాకపోవడం ఎంతో దురదృష్టకరమని అన్నారు. ఈ యొక్క సమ్మర్ కంపెనీ విద్యార్థులు చక్కగా ఉపయోగించుకుంటారని వారందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి తాళ్ల శ్రీధర్ గౌడ్, కోశాధికారి కృష్ణ కిషోర్, భాస్కర్ రెడ్డి, AISF జిల్లా అధ్యక్షులు వలమల్ల ఆంజనేయులు, డాన్స్ మాస్టర్ ఏడుకొండలు, జమీర్, దాసరి రమేష్, వినయ్, శివ, రవి, చింటూ, రాము, అంజయ్య, క్రీడాకారులు కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి సోమవారం ఆర్డీఓ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం




**జయభేరి, దేవరకొండ :**

రాజస్వ మండలాధికారి కార్యాలయము నందు డివిజన్ స్థాయి ప్రజావాణి కార్యక్రమములో 25 అర్జీలు సమర్పించగా అట్టి అర్జీలను ప్రజావాణి ఆన్లైన్ ద్వారా ఆయా శాఖలకు పంపించి అట్టి అర్జీలపై సత్వరముగా పరిష్కరించాలని సంబందిత అధికారులను రాజస్వ మండలాధికారి దేవరకొండ డివిజన్ స్థాయి ప్రజావాణి కార్యక్రమములో కోరియున్నారు.

## అమ్మా.. నీకు వందనం..!

- పుట్టినరోజు సందర్భంగా తల్లి ఆశీర్వాదం తీసుకున్న ఎమ్మెల్యే జిఎంఆర్



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని చిన్న చింతకుంట మండలం ధమగ్నాపూర్ లో సోమవారం దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) తన తల్లి ఆశీర్వాదం తీసుకున్నారు. ప్రతి ఏడాది తన పుట్టినరోజు ముందుగా ఎమ్మెల్యే జిఎంఆర్ తన తల్లి కి పాదాభివందనం చేసి ఆశీర్వాదం తీసుకున్న తర్వాతనే గ్రామాల పర్యటనకు బయలుదేరడం అన్నవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే ఈ ఏడాది కూడా తన పుట్టినరోజును పురస్కరించుకొని ఎమ్మెల్యే జిఎంఆర్ తన తల్లికి పాదాభివందనం చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఆ తర్వాత గ్రామాల పర్యటనకు బయలుదేరారు.

# ఘనంగా రైతు వారోత్సవాలు

- భూసార పరీక్షల ప్రాధాన్యతపై అవగాహన కల్పించిన అధికారులు
- రైతు అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం - చైర్మన్ కంఠం శిరీష కృష్ణారెడ్డి

**జయభేరి, శామీర్ పేట్, మే 4:**



వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా రైతులు పంటలు సాగు చేయాలని అలియాబాద్ మున్సిపల్ చైర్మన్ కంఠం శిరీష కృష్ణారెడ్డి అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అలియాబాద్, లాల్ గడి మలక్ పేట్ గ్రామలో రైతు వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ కంఠం శిరీష కృష్ణ రెడ్డి , జిల్లా ఆర్టీఏ సభ్యులు భీమిడి జైపాల్ రెడ్డి లు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులకు నేల ఆరోగ్య పరిరక్షణ, సమతుల్య ఎరువుల యాజమాన్యం, భూసార పరీక్షల ప్రాధాన్యతపై వ్యవసాయ శాఖ అధికారులు ప్రత్యేక అవగాహన కల్పించారు. వ్యవసాయ భూముల నుంచి మట్టి నమూనాలు ఎలా సేకరించాలి, వాటిని పరీక్షలకు ఎలా పంపించాలి అనే అంశాలను ప్రత్యక్షంగా రైతులకు వివరిస్తూ ప్రదర్శన ఇచ్చారు. భూసార పరీక్షల ద్వారా పంటలకు అవసరమైన పోషకాలు, ఎరువులను ఎలా వినియోగించాలి, అధిక వ్యయం తగ్గించి దిగుబడులు ఎలా పెంచుకోవాలో వివరించారు. అనంతరం రైతులకు భూసార పరీక్ష ఫలితాల కార్డులను పంపిణీ చేసి అదే విధంగా రైతులు ఎక్కువగా సాగు చేస్తున్న సన్న రకం వరి సాగు, వాటి దిగుబడులు, మార్కెట్ అవకాశాలను అధికారులు వివరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ కంఠం శిరీష కృష్ణారెడ్డి, జిల్లా ఆర్టీఏ సభ్యులు భీమిడి జైపాల్ రెడ్డి లు మాట్లాడుతూ రైతు అభ్యున్నతి ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని అన్నారు. రైతులకు శాస్త్రీయ పద్ధతుల్లో సాగు విధానాలు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. ఇక రైతులు భూసార పరీక్షలు చేయించుకుని సరైన పద్ధతుల్లో ఎరువుల వినియోగం చేయడం ద్వారా ఖర్చులు తగ్గి అధిక దిగుబడులు పొందవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు జశ్వంత్ రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ బిక్షపతి, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేష్, మండల వ్యవసాయ అధికారి రమేష్, మేడ్చల్ మట్టి నమూనాల పరీక్ష కేంద్రం అధికారి కృష్ణవేణి, వ్యవసాయ విస్తరణ అధికారులు సుధీర్ కుమార్, రవియాదవ్, రైతులు కంఠం కృష్ణా రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, కార్తీక్ రెడ్డి, వీరస్వామి, రవీందర్ రెడ్డి, హరిశంకర్ గౌడ్, రాఘవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ఆశీర్వాదాలే నాకు బలం

- ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

**జయభేరి, యాదగిరిగుట్ట, మే 04 :**



ఆలేరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లడం నా బాధ్యత అని, ప్రజల ఆశీర్వాదాలే నాకు బలమని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. సోమవారం యాదగిరిగుట్ట మండలంలోని సైదాపురం గ్రామంలో వీరభద్ర స్వామి వారిని బీర్ల అయిలయ్య దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తెలంగాణ రాష్ట్ర ప్రజలు ఆయురారోగ్యాలు, సుఖశాంతులతో ఉండాలని, ఆలేరు నియోజకవర్గం సమగ్రాభివృద్ధి సాధించాలని కోరుకున్నారు. అనంతరం గ్రామ ప్రజలతో మాట్లాడిన ఆలేరు ఎమ్మెల్యే వారి సమస్యలను తెలుసుకున్నారు. తాగునీరు, రహదారులు, విద్యుత్, ఇళ్ల సమస్యలపై వెంటనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజల సంక్షేమం, గ్రామాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని, అన్ని రంగాన్ని నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని తెలిపారు. ఆయన వెంట సైదాపురం గ్రామ సర్పంచ్ కన్నాయి రోజాదర్శన్,ఉప సర్పంచ్ దుంబాల వెంకట్ రెడ్డి, వార్డు సభ్యులు సిద్దేశ్వర్, శ్రీధర్, మున్సిపల్ 11వ వార్డు కౌన్సిలర్ ముఖ్యర్ల మల్లేష్, కాంగ్రెస్ నేతలు గుండ్లపల్లి భరత్ గౌడ్, శిఖ ఉపేందర్, సుడుగు శ్రీనివాస్ రెడ్డి, గుండ్లపల్లి లింగం గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# ఇండ్ల స్థలాల కోసం పాత్రికేయులు సొసైటీ ఏర్పాటు చేసుకోవాలి

- అదనపు కలెక్టర్ మహేందర్ జి.
- అర్హులైన విలేకరులకు అక్రిడేషన్లు, ఇండ్లు నిర్మించి ఇవ్వాలి
- జర్నలిస్ట్ జాయింట్ యాక్షన్ కమిటీ

**జయభేరి, ములుగు :**



ములుగు జిల్లాలోని పాత్రికేయులు ఇండ్ల స్థలాలను పొందడానికి జిల్లాలో హౌసింగ్ సొసైటీ ఏర్పాటు చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మహేందర్ జి. అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశపు హాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా జర్నలిస్ట్ జాయింట్ యాక్షన్ కమిటీ పాత్రికేయులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహేందర్ జి మాట్లాడుతూ.. జిల్లాలో హౌసింగ్ సొసైటీ లేని కారణంగానే ఇండ్ల స్థలాలను కేటాయించడం జరుగలేదని, స్థల పరిశీలన చేసి అర్హులకు ఇండ్ల స్థలాలు కేటాయించడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జె.జాక్ కన్వీనర్ గుర్రపు శ్రీధర్ మాట్లాడుతూ అర్హులైన విలేకరులకు అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయడంతో పాటు ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. జిల్లా కేంద్రంలో 2024 సంవత్సరంలో ప్రెస్ క్లబ్ నిర్మాణానికి మంత్రి సీతక్క శంకుస్థాపన చేయగా నేటి వరకు భవన నిర్మాణ పనులు ప్రారంభం కాలేదని, ఇప్పటికైనా భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు జినుకల ప్రభాకర్, కో కన్వీనర్లు పోలోజు రామ్మూర్తి, ఎనగందుల కొమురయ్య, మాట్ల సంపత్, సంగ రంజిత్, చల్లగురుగుల రాజు, లకుమయ్య తదితరులు పాల్గొన్నారు.



## మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో నూతన కోర్సు ప్రారంభం

**జయభేరి, తుర్కపల్లి, మే 04 :**

తుర్కపల్లి మండలం రాంపూర్ తండాలోని మోడల్ స్కూల్, జూనియర్ కళాశాల లో ఈ విద్యా సంవత్సరం నుండి ఇంటర్మీడియట్లో అకౌంట్స్, కామర్స్, ఎకనామిక్స్ (ఏసిఈ) కోర్సును ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపల్ అంబటి శోభారాణి తెలిపారు. ఈ కోర్సు ద్వారా భవిష్యత్తులో మంచి ఉపాధి అవకాశాలు ఉంటాయని అన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఎక్కువమంది ఉపాధి పనికి హాజరయ్యేలా ప్రోత్సహించాలి



**జయభేరి, తుర్కపల్లి, మే 04 :**

గ్రామాల్లో ఎండాకాలంలో వ్యవసాయ పనులు లేని సందర్భంలో ఎక్కువ మంది ఉపాధి పనికి హాజరయ్యేలా ప్రోత్సహించాలని మండల స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ మోతిలాల్ అన్నారు. సోమవారం తుర్కపల్లి మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై సర్పంచులకు, కార్యదర్శులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి అవసరమైన పనులు గుర్తించి తీర్మానాలు పంపించాలని సూచించారు. పనిచేయడానికి 40 మందికి ఒక మేట్ ను ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. గ్రామాల్లో ఎండాకాలం చెట్లకు నీరు అందించాలని అన్నారు .పని ప్రదేశంలో కూలీలకు వసతులను ఏర్పాటు చేయాలని టెంట్లు, నీళ్లు, ఓఆర్ఎస్, మెడికల్ కిట్ అందజేయాలన్నారు. యాక్టివ్ జాబ్ కార్డు గల కూలీలకు 100 శాతం ఈ కేవైసీ చేయాలని ఇందిరమ్మ గృహాలకు టాయిలెట్స్ నిర్మాణం 12 వేల రూపాయలు, ఇందిరమ్మ ఇండ్లకు 26,700 విలువగల 90 పని దినాలకు ఉపాధి హామీ ద్వారా వేతనం చెల్లించాలని, నర్సరీలు విత్తనాల మొలకెత్తడం ,కాళీ బ్యాగుల్లో వేరే చెట్లను నాటడం, వనమహోత్సవ కార్యక్రమానికి పని ప్రదేశాలు గుర్తించి తీర్మానం చేయాలని, సిఎస్సి కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్స్ నిర్మాణము, ఇంటింటికి ఇంకుడు గుంతల నిర్మాణం, ఊరు చివర మురుగు నీరు నిల్వ చేసే పెద్ద సోక్ ఫీట్ నిర్మాణము, కమ్యూనిటీ సోక్ ఫీట్ నిర్మాణాలు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లెంకల గీతారెడ్డి, ఎంపీ ఓ వెంకటేశ్వర్లు, ఏపిఓ ఎర్ర నారాయణ, ఈసీ యశోద, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## ఇరిగేషన్ శాఖ ఈఈ సతీష్ చంద్ర ఆత్మహత్య

**జయభేరి, నల్గొండ :**

నల్లగొండ జిల్లా ఇరిగేషన్ శాఖలో విషాదం నెలకొంది. ఇరిగేషన్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సతీష్ చంద్ర ఆత్మహత్య చేసుకున్నారు. సాగునీటి కాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్నారు. ఉదయ సముద్రం ప్రాజెక్టు పరిధిలోని చందనపల్లి D37 కాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్నారు. సతీష్ చంద్ర మృతిపై అనుమానాలు వున్నాయని కుటుంబ సభ్యుల అరోపణ. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# రామలింగేశ్వరుడికి వేదోక్తంగా అభిషేకాలు

**జయభేరి, యాదగిరిగుట్ట, మే 04 :**



యాదగిరిగుట్ట కొండపైన కొలువైన శ్రీపర్వత వర్ధినీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం శివుడికి ప్రీతికరమైన రోజు కావడంతో రామలింగేశ్వరుడికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

**శ్రీనారసింహుడికి నిత్యపూజలు..**

శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారికి నిత్యపూజలు కొనసాగుతున్నాయి. సోమవారం తెల్లవారు జామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతం, అర్చనను శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలకు అనుమతించారు. శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకున్న భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో జరిగిన శ్రీసుదర్శన నారసింహ హోమం,నిత్య కల్యాణం, నిత్య బ్రహ్మోత్సవం, వెండి జోడి సేవ, స్వర్ణ పుష్పార్చన, శ్రీసత్యనారాయణస్వామి వ్రత పూజలలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కొండపైన కొలువైన శ్రీపర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకొని ఆలయంలో జరిగిన నిత్యపూజలలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**శ్రీనారసింహుడి నిత్యరాబడి..**

శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారికి నిత్యరాబడిలో భాగంగా సోమవారం రూ.25,18,696 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ప్రధాన బుకింగ్ ద్వారా రూ.2,00,950, బ్రేక్ దర్శనం ద్వారా రూ.1,83,900, శ్రీసత్యనారాయణ స్వామి వ్రతాల ద్వారా రూ.1,70,000, వీఐపీ దర్శనం ద్వారా రూ.2,92,650, కొండపైకి వాహన ప్రవేశం ద్వారా రూ.4,02,500, సువర్ణ పుష్పార్చన ద్వారా రూ.51,232, ప్రసాద విక్రయం ద్వారా రూ.8,68,250, కల్యాణకట్ట ద్వారా రూ.75,000తో పాటు వివిధ శాఖలు,పాతగుట్ట ఆలయం ద్వారా ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.



## తాడి ల్యాండ్ ఫిల్పై జిల్లా కలెక్టర్కు తాడి గ్రామస్తులు ఫిర్యాదు

- జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద గ్రామస్తులు ఆందోళన

**జయభేరి, పరవాడ:**

పరవాడ మండలంలో తాడి గ్రామంలో ల్యాండ్ ఫిల్ ప్రతిపాదనలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ తాడి గ్రామస్తులు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. తాడి గ్రామంలో సర్వేనెంబర్ 116 లో జీవో ఎంఎస్ నెంబర్ 13, 14 ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే కాలుష్య కోరల్లో చిక్కుకున్న తాడి గ్రామ ప్రజలకు మరో కాలుష్య కొంపటి పెట్టొద్దని అన్నారు. గ్రామాన్ని తరలించాలని డిమాండ్ చేశారు. తాడి గ్రామంలో ల్యాండ్ ఫిల్ పెడితే ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్ తో పాటుగా పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఏఈకి అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గని శెట్టి సత్యనారాయణ, తాడి మాజీ సర్పంచ్ బొడ్డపల్లి అప్పారావు, గొల్లవిల్లి అచ్చు బాబు, కోమటి సూరిబాబు, గని రెడ్డి కనక రాజు, గొల్లవెల్లి నాగరాజు, జి శ్రీను, ఎం సూరి అప్పారావు, గుమ్మాల రాము, సాలాపు రమణ, వై నరేష్, తదితరులు పాల్గొన్నారు.

## తిక్కవానిపాలెం బీచ్ లో వ్యక్తి గల్లంతు

- గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు



**జయభేరి, పరవాడ:**

పరవాడ మండలం పరిధిలోని తిక్కవానిపాలెం బీచ్ వద్ద ఒక వ్యక్తి ప్రమాద వశాత్తు మునిగిపోయిన ఘటన చోటుచేసుకుంది. సోమవారం సాయంత్రం సుమారు 04:30 గంటల సమయంలో పి. బొనంగి గ్రామానికి కవ్వూరి గోవిందరావు నివాసి తన కుటుంబ సభ్యులు ఐదుగురు మరియు అండమాన్ నుండి వచ్చిన పరిచయస్తులతో కలిసి వివాహానికి హాజరైన తిక్కవానిపాలెం బీచ్‌కు వచ్చారు.ఈత రాని గోవిందరావు, ఇతరులు హెచ్చరించినప్పటికీ పట్టించుకోకుండా సముద్రంలో లోతుగా వెళ్లి తిరిగి రాలేకపోవడంతో మునిగిపోయినట్లు అనుమానం వ్యక్తమవుతోందని ప్రస్తుతం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని ఈ ఘటనపై తదుపరి విచారణ కొనసాగుతోందని పరవాడ పోలీస్ శాఖ తెలియజేసింది.

## రాయిలపూర్‌లో రైతు వారోత్సవం నిర్వహణ




**జయభేరి, మేడ్చల్ :**

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రాయిలపూర్ రైతు వేదికలో రైతు వరోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎల్లంపేట్ మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ రజిత దేవేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కౌన్సిలర్లు, స్థానిక రైతులు, వ్యవసాయ అధికారులు ఏవో మాధవరెడ్డి, ఏఈఓలు తేజస్విని, సుమతా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు రైతులకు పలు ముఖ్య అంశాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా మట్టి పరీక్షల ప్రాముఖ్యత, మట్టి నమూనాలను సేకరించే విధానం గురించి వివరించారు. అలాగే పచ్చిరొట్టి ఎరువుల వినియోగం, సేంద్రియ వ్యవసాయ పద్ధతుల ప్రాధాన్యం, నానో యూరియా వినియోగం వంటి అంశాలపై సమగ్రంగా సూచనలు అందించారు. ఇక రైతులు పండిస్తున్న సన, దొడ్డు రకాల పంటలపై కూడా చర్చించి, మెరుగైన దిగుబడులు సాధించేందుకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమం ద్వారా రైతులకు నూతన వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా ఉందని నిర్వాహకులు తెలిపారు.

## పద్మశాలి భీదలకు బియ్యం, నిత్యావసరం సరుకులు అందజేత



**జయభేరి, దేవరకొండ :**

ఆంజనేయస్వామీ దేవాలయములో అజ్ఞాత దేవరకొండ వాసి బీదలకు బియ్యం, నిత్యావసర సరుకులు ముసిని వీరయ్య ద్వార అందజేసినారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పద్మశాలి కులాభాందవుడు దేవరకొండ వాసి ప్రతినెల 10 మంది బీద కుటుంబాలకు నిత్యావసరం సరుకులు గత మూడు నెలలనుండి అందజేస్తున్నారు. వారు జీవిత కాలం అందజేస్తానని తెలియజేసినారు. స్వీకరించిన వారు దాతకు కృతజ్ఞతలు తెలియజేసి శతమానం భవతి అని దివించినారు. ఈ కార్యక్రమంలో పోపా ఉపాధ్యక్షులు అంకం చంద్రమౌళి, అలంపల్లి శ్రీనివాసులు, ముసిని జంగయ్య దేవాలయం పెద్దలు తదితరులు పాలుగొన్నారు.



## రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ఎమ్మెల్యే జిఎంఆర్ దంపతుల పూజలు

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలం వడ్డేమాన్ సమీపంలోని రామ లింగేశ్వర స్వామి వారిని సోమవారం దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) దంపతులు దర్శించుకున్నారు. ఎమ్మెల్యే జిఎంఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని కుటుంబ సమేతంగా దేవాలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మద్దూర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు నిర్వహించిన జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే జిఎంఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీ చైర్మన్ స్వర్ణ సుధాకర్ రెడ్డి ఎమ్మెల్యే జిఎంఆర్ కు పూల మొక్కను అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## దేవరకద్రలో బిజెపి విజయోత్సవ సంబరాలు



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో సోమవారం రాత్రి బిజెపి విజయోత్సవ సంబరాలు నిర్వహించింది.మూడు రాష్ట్రాల్లో బ్రహ్మాండమైన విజయం సాధించినందుకు ఆ పార్టీ ఈ సంబరాలను నిర్వహించింది. ఈ సందర్భంగా స్థానిక పాత బస్టాండ్ లో పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చారు. సీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మళ్లీ కెసిఆర్ ముఖ్యమంత్రి కావాలి

- మొక్కు తీర్చుకున్న ఓర్సు ముత్యాలు



**జయభేరి, డిండి :**

డిండి మండలం వావిల్ కోల్ వడ్డరిగూడెం బీఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు ఓర్సు ముత్యాలు మళ్లీ కెసిఆర్ ప్రభుత్వం రావాలి అని శ్రీ వెంకటేశ్వర స్వామి తిరుపతి ఆలయం కు వెళ్లి మొక్కు తీర్చుకున్నారు. తెలంగాణ ప్రజలందరూ మళ్లీ కేసీఆర్ ప్రభుత్వం రావాలని కోరుకుంటున్నారు అని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఆరు గ్యారంటీలను నెరవేర్చకుండా ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నం చేస్తూ బీఆర్ఎస్ నాయకులపై కేసు లను బనాయిస్తూ ప్రజలను దృష్టి మరల్చడానికి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ప్రభుత్వమంతా స్కీములు స్కములంటూ కాలం వెళ్ళదీస్తున్నారని ప్రజలకు వాళ్ళు చేసేదేమీ లేదని, ప్రజలంతా మళ్ళీ కేసీఆర్ ప్రభుత్వాన్ని కోరుతున్నారని ఓర్సుముత్యాలు ఒక ప్రకటనలో తెలియజేసినారు.

# బొగ్గు లారీల కాలుష్యంపై అధికారులు చర్యలు చేపట్టాలి

- సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గని శెట్టి డిమాండ్

**జయభేరి, పరవాడ:**




మండల కేంద్రమైన పరవాడ సినిమా హాల్ జంక్షన్లో సోమవారం బొగ్గు లారీల కాలుష్యం అరికట్టాలని ధూళి కాలుష్యాన్ని కారణమవుతున్న హిందూజా, ఎన్టిపిసి యాజమాన్యాలపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గని శెట్టి. సత్యనారాయణ మాట్లాడుతూ బొగ్గు లారీలు కాలుష్యంతో పరవాడ లంకెలపాలెం ఊటగడ్డ మూల స్వయంవరం కలపాక గ్రామాలు తీవ్రమైన కాలుష్యంతో అనేక జబ్బులకు గురవుతున్నారని అన్నారు. ప్రభుత్వాలుపట్టించుకోవడంలేదని అన్నారు. కూటమి నాయకులు హిందుజా యాజమాన్యానికి అండగా నిలుస్తున్నారని అన్నారు. లంకెలపాలెం, పరవాడ ప్రాంతంలో రోడ్డు పక్కన ప్రజలు ఉండలేని పరిస్థితి ఏర్పడుతుందని నిత్యం ధూళి కాలుష్యంతో అల్లాడుతున్నారని అన్నారు. షాపులు నడవడం లేదని, ద్విచక్ర వాహనదారులు ఈ మార్గంలో ప్రయాణించడమే నరకంగా మారిందని అన్నారు. భారీ బొగ్గు రవాణా చేయడం వలన రోడ్లు ధ్వంసం అవుతున్నాయి అన్నారు. ఇప్పటికైనా పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, ఆర్టీవో, పోలీస్ అధికారులు చర్యలు చేపట్టాలని గని శెట్టి డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజా పోరాటం తప్పదని హెచ్చరించారు. ప్రభుత్వంలో ఉన్న పెద్దలు ఉద్యమాలను జరక్కుండా ప్రజలను అంచివేస్తున్నారని ఇది ఎంతోకాలం సాగదని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు ప్రభుత్వం అధికారులు సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కే నాయుడు, ఆర్ సన్యాసి నాయుడు, శ్రీను, సత్తిబాబు, రమణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు

# అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తాం

- ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

**జయభేరి, యాదగిరిగుట్ట, మే 04 :**



తెలంగాణ రాష్ట్రంలోని అర్హులైన ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తెలిపారు. సోమవారం యాదగిరిగుట్ట పట్టణంలోని 11వ వార్డులో ఇందిరమ్మ ఇల్లును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారికి పట్టువస్త్రాలు,యాట పొట్టేలును అందజేశారు. అనంతరం బీర్ల అయిలయ్య మాట్లాడుతూ పేదల సొంతింటి కల నెరవేరడం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంకల్ప బలమని అన్నారు. ప్రతి అర్హుడికి ఇల్లు మంజూరు చేయించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. యాదగిరిగుట్ట పట్టణాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్లేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజల సంక్షేమం,మౌలిక వసతుల అభివృద్ధి, పేదల జీవన ప్రమాణాల మెరుగుదల కోసం నిరంతరం పనిచేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్‌పర్సన్ గుండ్లపల్లి వాణీభరత్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్ లింగస్వామి, 11వ వార్డు కౌన్సిలర్ ముక్కెర్ల మల్లేష్ యాదవ్,కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బందారపు భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# కురుమూర్తి దేవస్థానం వద్ద ఎమ్మెల్యే జిఎంఆర్ జన్మదిన వేడుకలు

- కుటుంబ సమేతంగా దేవాలయంలో పూజలు

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లాలోని ప్రధాన పుణ్య క్షేత్రమైన చిన్నచింతకుంట మండలంలోని శ్రీ కురుమూర్తి స్వామి దేవాలయం వద్ద సోమవారం దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా ఎమ్మెల్యే జిఎంఆర్ కుటుంబ సమేతంగా దేవాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పురోహితులు జిఎంఆర్ పై అక్షింతలు చల్లి ఆశీర్వచనం పలికారు. అనంతరం స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. అలాగే దేవస్థానం వద్ద వివిధ ప్రాంతాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఎమ్మెల్యే జీఎంఆర్ కు గజమాలలతో సన్మానించారు. పూల బొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





## బీర్ల అయిలయ్య దిష్టిబొమ్మ దహనం

**జయభేరి, యాదగిరిగుట్ట, మే 04 :**

మాజీ మంత్రి,సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు పై ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసిస్తూ బీఆర్ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో యాదగిరిగుట్ట పట్టణంలో ప్రధాన రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. ఖబర్దార్ అయిలయ్య బీర్ల అయిలయ్య డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం ప్రధాన కూడలి వద్ద బీర్ల అయిలయ్య దిష్టిబొమ్మ దహనం చేశారు. ఆరు సార్లు ఎమ్మెల్యేగా, ఇరిగేషన్ శాఖ,ఆర్థికశాఖ, వైద్యారోగ్యశాఖ మంత్రిగా ఈ రాష్ట్రానికి సేవ చేసిన మాజీ మంత్రి హరీశ్ రావు హోదాను మరిచి,అదిష్టానం మెప్పుకోసం నోటికి వచ్చినట్టుగా మాట్లాడితే సహించేది లేదన్నారు. మాట్లాడేటప్పుడు ఆలోచించి మాట్లాడాలన్నారు. అధికారంలో ఉన్నామని విర్రవీగి నోరు జారితే తగిన గుణపాఠం చెబుతామన్నారు. ఇప్పటి వరకు వరిధాన్యం కొనుగోళ్లు కేంద్రాల్లో 30 శాతం వడ్లను కొనుగోలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో రైతులే కర్రకాల్చి వాత పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య వెంటనే మాజీ మంత్రి హరీష్ రావుకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య,పట్టణ మాజీ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి, బిఆర్ఎస్ నాయకులు వాసం రమేష్, మాటూరి బాలయ్యగౌడ్, ముఖ్యర్ల సతీష్, వీరేశం, వాసు, క్రాంతి, ఆత్కూరి అయిలయ్య, సతీష్ బట్ , యాకుబ్, లింగం, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ నేతలు సంబరాలు



**జయభేరి, యాదగిరిగుట్ట, మే 04:**

బీజేపీ మూడు రాష్ట్రాల్లో విజయం సాధించినందుకు యాదగిరిగుట్ట పట్టణంలోని బీజేపి పార్టీ నేతలు సంబరాలు చేసుకున్నారు. యాదగిరిగుట్ట పట్టణంలోని బాణసంచా పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రచ్చ శ్రీనివాస్, బీజేపి పార్టీ పట్టణ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్ మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్ లో మమతా బెనర్జీ రాక్షస పాలన నేటితో అంతమైందని,హిందువులని హింసించిన క్రూర దీదీ గద్దె దింపినందుకు హర్షిస్తున్నామన్నారు. వచ్చే ఎన్నికలలో తెలంగాణలో కూడా బీజేపీ అధికారంలోకి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ 1వ వార్డు కౌన్సిలర్ బోడ రాధ సురేష్, బీజేపి నేతలు ఆకుల చంద్రమౌళి, శ్యామ్, సత్యం, మందోజూ నరేష్, దొమ్మాట ప్రభాకర్, ఆలేటి కర్ణ, తాళ్ల భాస్కర్ రెడ్డి, మిట్ట వీరేశం, బెలిదే అశోక్, నంగునూరి బాలరాజు, అజయ్, బాలు, వంశీ, విజయ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ మూడు రాష్ట్రల గెలుపుతో పరవాడలో బీజేపీ శ్రేణులు సంబరాలు



**జయభేరి, పరవాడ:**

మండల కేంద్రమైన పరవాడలో సోమవారం బిజెపి ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో విజయోత్సవ సంబరాలు ఘనంగా జరిగాయి. పశ్చిమ బెంగాల్, అస్సాం మరియు పుదుచ్చేరి రాష్ట్రాల్లో బిజెపి ఘనవిజయం సాధించిన సందర్భంగా బిజెపి రాష్ట్ర ఓబిసి మోర్చా కార్యవర్గ సభ్యులు కూండ్రపు సోమునాయుడు ఆధ్వర్యంలో బాణసంచా కాల్చి స్థానిక ప్రజలకు మిఠాయిలు పంచి విజయోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు గండి నమో బాబు, జిల్లా కిషన్ మోర్చా వైస్ ప్రెసిడెంట్ బండారు రాజశేఖర్, స్థానిక బీజేపీ నాయకులు కూండ్రపు చిన బాబు ,బండారు రాజు, గండి ఈశ్వరరావు, పైల జగన్నాథరావు, బండారు అజయ్, పైల నానాజీ, చుక్క గోపి, పైల అప్పలనాయుడు, గండి శ్రీను, కసిరెడ్డి అప్పలనాయుడు, సుజన్, సాయి, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

## సిద్ధి వినాయక దేవాలయ వార్షికోత్సవ వేడుకలకి సర్వం సిద్ధం



**జయభేరి, పరవాడ:**

పరవాడ మండలం నాయుడుపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీ శ్రీ శ్రీ సిద్ధి వినాయక దేవాలయ 8వ వార్షిక ఉత్సవాలు మే 6వ తేదీ అనగా బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు.గ్రామ పంచాయతీ ప్రజల సహాయ సహకారాలతో, కూండ్రపు వీఆర్ఓ శ్రీను ఆధ్వర్యంలో ఈ వేడుకలు ఘనంగా జరగనున్నాయి. బుధవారం ఉదయం 7 గంటల నుండి వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య గణపతి హోమం, ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించబడతాయి. అనంతరం మధ్యాహ్నం 12 గంటల నుండి భక్తులకు, గ్రామ ప్రజలకు ఆలయ ప్రాంగణంలో దాతల సహకారంతో భారీ అన్నసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు. స్వామి వారి ఉత్సవాలకు, అన్నసంతర్పణకు విరాళాలు ఇవ్వదలచిన భక్తులు నిర్వాహకులను సంప్రదించవచ్చునని, వచ్చిన విరాళాల వివరాలను పారదర్శకత కోసం ఉత్సవం అనంతరం పంచాయతీ గ్రూపులో తెలియజేస్తామని పేర్కొన్నారు. ఈ వార్షికోత్సవ వేడుకల్లో గ్రామ ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.





# బెంగాల్ సీఎంగా సువేందు అధికారి

**రేసులో మరో ఎంపీ ప్రముఖ నటి రూపా గంగూలీ**

**జయభేరి, కోల్ కత్తా, మే 4 :**

పశ్చిమ బెంగాల్ రాజకీయ చరిత్రలో ఒక కీలక మలుపు చోటు చేసుకునే సూచనలు కనిపిస్తున్నాయి. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ దూసుకెళ్తోంది. ఈ స్టోరీ రాసే సరికి ఉన్న ట్రెండ్ చూస్తే బీజేపీ అక్కడ ప్రభుత్వం ఏర్పాటు చేసేంత మ్యాజిక్ ఫిగర్ సాధించే సీట్లలో ఆధిక్యంలో ఉంది. రాష్ట్ర అధికార కేంద్రమైన నబన్న వైపు కాషాయ దళం వేగంగా అడుగులు వేస్తోంది. ఈ ఎన్నికల ఫలితాల్లో అత్యంత ఆసక్తికరమైన అంశం ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తన సొంత నియోజకవర్గంలో ఆయాసంతో పరుగులు పెడుతున్నారు. స్వల్ప ఆధిక్యంలో కొనసాగుతోంది. దీంతో ముఖ్యమంత్రిగా ఎవరు ప్రమాణం చేస్తారనే చర్చ మొదలైంది. మమతతో విభేదించి బీజేపీలో చేరినప్పటి నుంచి విజయం వరకు బీజేపీని నడిపించిన సువేదు అధికారి తర్వాతా సీఎం కుర్చీలో కూర్చుంటారనే చర్చ సాగుతోంది. ప్రస్తుతం ట్రెండ్స్ ప్రకారం భవానీపూర్‌లో మమతా బెనర్జీ స్వల్ప ఆధిక్యంలో ఉన్నారు. ఓట్ల లెక్కింపు మొదలైన తర్వాత ఆమె వెనుకబడ్డారు. అక్కడి ఫలితం రౌండ్ రౌండ్‌కి మారుతోంది. గతంలో 2021 అసెంబ్లీ ఎన్నికల్లో నందిగ్రామ్ వేదికా మమతా బెనర్జీని ఓడించిన సువేందు అధికారి, ఇప్పుడు మరోసారి ఆమెను ఓడించేంత పని చేస్తున్నారు. ఏ రౌండ్‌లో ఏం జరుగుతుందో అన్న ఉత్కంఠ అక్కడ నెలకొంది. మమత బెనర్జీ కంచు కోటలోనే సువేందు సవాల్ చేయడం టీఎంసీ శ్రేణులు కంగుతిన్నారు. ఎగ్జిట్ పోల్స్ అంచనాల ప్రకారం, తాను భవానీపూర్‌లో 20వేల మెజార్టీ సాధిస్తానని, రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ 180కిపైగా సీట్లు సాధిస్తుందని సువేందు చెప్పుకొచ్చారు. భవానీపూర్‌లో ఆ పరిస్థితి లేకపోయినా ఓవరాల్ సీట్ల విషయంలో మాత్రం ఆయన లెక్క తప్పలేదని తెలుస్తోంది. మమతకు ఒకప్పుడు అత్యంత సన్నిహితుడిగా పేరున్న వ్యక్తి సువేందు అధికారి. ప్రస్తుతం ఆమెను ప్రధాన రాజకీయ ప్రత్యర్థిగా మారారు. ఆయన రాజకీయ ప్రస్థానం గమనిస్తే... 2009లో లోక్‌సభకు ఎన్నికయ్యారు. 2016, 2020 పశ్చిమ బెంగాల్ ప్రభుత్వంలో రవాణా, పర్యావరణ శాఖ మంత్రిగా పని చేశారు. 2020, 2021 జూట్ కార్పొరేన్ ఆఫ్ ఇండియా ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. 2021 తృమూల్ కాంగ్రెస్ వీడి బీజేపీలో చేరారు. అదే ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నందిగ్రామ్‌లో మమతాబెనర్జీని ఓడించి దేశవ్యాప్తంగా గుర్తింపు పొందారు.ప్రస్తుతం ప్రతిపక్ష నేతగా ఉన్న ఆయన త్వరలోనే సీఎం కుర్చీలో కూర్చోనున్నారు.

సువేందు అధికారి ఒక అభ్యర్థిగానే కాకుండా, బెంగాల్ వ్యాప్తంగా బీజేపీ ప్రచార పగ్గాలను సమర్థవంతంగా నిర్వహించారు. ఈ ఎన్నికల్లో ఆయన చూపిన ప్రతిభ పార్టీలో ఆయన స్థానాన్ని, సీఎం కుర్చీ వేపు ఆయన ప్రయాణాన్ని మరింత దగ్గర చేసింది. పశ్చిమ బెంగాల్‌లో అధికారాన్ని చేజిక్కుంచుకోవాలని బీజేపీ చాలా కాలంగా ప్రయత్నాలు చేస్తోంది. మమతా బెనర్జీ శైలిలోనే వీధుల్లో పోరాడుతూ, ప్రజల్లోకి వెళ్లడం ద్వారా సువేందు అధికారి బీజేపీకి కొత్త ఊపిరి పోశారు. బెంగాల్ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో బీజేపీకి వచ్చిన ఆధిక్యం చూస్తుంటే, ప్రజలు మార్పును కోరుకుంటున్నట్టు స్పష్టమవుతోంది. ఒక వేళ ఇదే ట్రెండ్ కొనసాగి బీజేపీ విజయం సాధిస్తే, అది మమతా బెనర్జీ రాజకీయ ప్రస్థానానికి పెద్ద విఘాతంగా మారుతుంది. ముఖ్యమంత్రి సువేందు అధికారి అని చాలా మంది భావిస్తున్నప్పటికీ బీజేపీ నాయకత్వం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉన్నప్పటికీ, ప్రస్తుతం పరిస్థితుల్లో సువేందు పేరు ముందంజలో ఉందన్నారు.

**రేసులో మరో ఎంపీ**

మాజీ రాజ్యసభ ఎంపీ, ప్రముఖ నటి రూపా గంగూలీ కూడా సీఎం రేసులో ఉన్నట్టు తెలుస్తోంది. సోనార్‌పూర్ దక్షిణ నియోజకవర్గం నుంచి ఆమె పోటీ చేస్తున్నారు. ముఖ్యంగా పట్టణ ఓటర్లలో ఆమెకు విపరీతమైన ఆదరణ ఉంది. దశాబ్ద కాలంగా బీజేపీలో ఉంటూ, పార్టీ మహిళా విభాగంలో కీలక పాత్ర పోషించిన ఆమెకు పాలనాపరమైన అనుభవం కూడా తోడవుతుందని విశ్లేషణలు వినిపిస్తున్నాయి. సువేందు అధికారి కూడా సీఎం రేసులో ఉన్నారు. మమతకు కుడి భుజంగా ఉంటూ వచ్చిన ఆయన గత ఎన్నికల ముందు టీఎంసీకి రాజీనామా చేసి బీజేపీలో చేరారు. అప్పటి నుంచి మమతి నిజమైన ప్రత్యర్థిగా మారారు. ఆమె వైఖరిని ఎండగడుతూ బీజేపీని రూట్ లెవల్‌కు తీసుకెళ్లడంతో విజయవంతం అయ్యారు. నేటి విజయంలో ఆయన పాత్ర చాలా కీలకంగా ఉంది. అందుకే ఆయన పేరును కూడా సీఎం సీటు కోసం బీజేపీ అధిష్ఠానం పరిశీలిస్తోంది. ఏప్రిల్ నెలలో రెండు దశల్లో జరిగిన పోలింగ్‌కు సంబంధించిన లెక్కింపు ఇప్పుడు జరుగుతోంది. ఇందులో బీజేపీ మెజార్టీ స్థానాల్లో దూసుకెళ్తోంది. దశాబ్దాలుగా అధికారంలో ఉన్న టీఎంసీ ప్రభుత్వంపై ప్రజల్లో పేరుకుపోయిన అసంతృప్తి బీజేపీకి వరంగా మారింది. కేంద్ర నాయకత్వ నుంచి క్షేత్ర స్థాయి కార్యకర్తల వరకు బీజేపీ పక్కా ప్రణాళికతో ప్రచారం నిర్వహించడం కలిసి వచ్చింది. బెంగాల్ ప్రజలు ఒక కొతత్ మార్పును, సుస్థిర పాలనను ఆశించడం ఈ తీర్పునకు ప్రధాన కారణంగా చెప్పవచ్చు. బెంగాల్‌లో బీజేపీ మతపరమైన సమీకరణాలతోపాటు అభివృద్ధి మంత్రాన్ని కూడా బలంగా తీసుకెళ్లింది. ఉద్యోగ అవకాశాలు, శాంతి భద్రతల అంశాలపై ప్రజలను ఆకర్షించడంలో ఆ పార్టీ సఫలమైంది. టీఎంసీ అంతర్గత కుమ్ములాటలు కూడా ఆ పార్టీ విజయావకాశాలను దెబ్బ తీశాయి.

పశ్చిమ బెంగాల్ దశాబ్దాల తరబడి వామపక్షాల కోటగా ఉండేది. 2011లో మమతా బెనర్జీ కోటను బద్దలు కొట్టి అధికారాన్ని హస్తగతం చేసుకున్నారు. అప్పటి నుంచి టీఎంసీ బలంగా ఎదిగింది. అయితే 2019లో లోక్ సభ ఎన్నికల నుంచి బీజేపీ రాష్ట్రంలో క్రమంగా పుంజుకోవడం ప్రారంభించింది. 2021లో విఫలమైనప్పటికీ, 2026లో మాత్రం బీజేపీ గురి తప్పలేదు.

# జైలులో క్రిశాంక్ ను పరామర్శించిన కేటీఆర్

**జయభేరి, సంగారెడ్డి :**



సంగారెడ్డి జైలులో కాంగ్రెస్ ప్రభుత్వం బనాయించిన అక్రమ కేసుల్లో నిర్బంధంలో ఉన్న మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ మన్నె క్రిషాంక్ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించారు. ఆయనతో పాటు మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, పాడి కౌశిక్ రెడ్డి, సంజయ్, కేపి వివేకానంద, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మరియు పలువురు బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు. కేటీఆర్ మాట్లాడుతూ. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతీకార రాజకీయాలతో బీఆర్ఎస్ నాయకులను లక్ష్యంగా చేసుకుని అక్రమ కేసులు పెడుతోందని తీవ్రంగా విమర్శించారు. మన్నె క్రిషాంక్ ఒక చదువుకున్న యువకుడు, న్యాయవాది, పీహెచ్డీ పట్టా పొందిన వ్యక్తి. ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి ఉద్యమంలో ముందుండి పోరాడిన ఆయన, తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత టీఎస్ఎండీసీ చైర్మన్గా బాధ్యతలు నిర్వర్తించారు అని తెలిపారు. గత రెండున్నర సంవత్సరాలుగా ప్రభుత్వ అవినీతి, అక్రమాలను ప్రశ్నిస్తూ, ప్రజల ముందుకు తీసుకువస్తున్నందుకు క్రిషాంక్పై వరుసగా కేసులు నమోదు చేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. “నాలుగేళ్ల కంటే తక్కువ శిక్ష ఉన్న కేసుల్లో స్టేషన్ బెయిల్ ఇవ్వాల్సిన పరిస్థితిలో, 12 రోజులుగా జైలులో పెట్టి ‘హ్యాబిచ్యువల్ అఫెండర్’గా చూపించడం దుర్మార్గం” అని అన్నారు. కేటీఆర్ వివరించిన ప్రకారం, క్రిషాంక్పై సుమారు 35 కేసులు నమోదు చేయబడ్డాయి. వాటిలో ముఖ్యంగా.. మిస్ ఇంగ్లాండ్పై జరిగిన వేధింపుల ఘటనను సోషల్ మీడియాలో ప్రస్తావించినందుకు ఒక కేసు, ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులు, బినామీ కంపెనీల వ్యవహారాలను బయటపెట్టినందుకు మరో కేసు, కాంట్రాక్టుల కేటాయింపుల్లో అవినీతిని వెలుగులోకి తెచ్చినందుకు కేసులు, గ్రామీణ స్థాయిలో జరిగిన అన్యాయాలను ప్రశ్నించినందుకు కేసులు పెట్టారని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో పెరుగుతున్న నేరాలపై ప్రభుత్వం దృష్టి పెట్టకుండా, సోషల్ మీడియా పోస్టులపై కేసులు పెట్టడంలోనే బిజీగా ఉందని కేటీఆర్ విమర్శించారు. “కరీంనగర్లో పగటిపూట కాల్పులు జరుగుతున్నా ప్రభుత్వం స్పందించలేదు. కానీ ఎవరు ట్వీట్ చేశారు అన్నదానిపై మాత్రం అప్రమత్తంగా ఉంది” అని అన్నారు. పోలీసు వ్యవస్థను ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తోందని ఆరోపిస్తూ, “పోలీసులు ముఖ్యమంత్రి ప్రైవేట్ ఆర్మీలా పనిచేస్తున్నారు. ఫోన్ ట్యాపింగ్, హ్యాకింగ్, జర్నలిస్టులపై వేధింపులు వంటి చర్యలు కొనసాగుతున్నాయి” అని కేటీఆర్ అన్నారు. హైకోర్టు ఆదేశాలను కూడా లెక్క చేయకుండా క్రిషాంక్ను అరెస్ట్ చేయడం చట్టవిరుద్ధమని పేర్కొంటూ, ఈ విషయంపై కోర్టులో కంటెంప్ట్ పిటిషన్ వేస్తామని తెలిపారు. “మా నాయకులను వేధించినా మేము వెనక్కి తగ్గం. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు మా పోరాటం కొనసాగుతుంది” అని బీఆర్ఎస్ పార్టీ తరఫున కేటీఆర్ హెచ్చరించారు. అదేవిధంగా, బీఆర్ఎస్ సోషల్ మీడియా కార్యకర్తలకు ధైర్యం చెప్తూతూ, “ఎవరూ భయపడవద్దు. పార్టీ లీగల్ సెల్ మీకు అండగా ఉంటుంది. న్యాయం, ధర్మం మన వైపు ఉన్నాయి” అని తెలిపారు.

# సీఎం రేవంత్ ను కలిసిన ఎంపీ ఈటెల

**జయభేరి, హైద్రాబాద్ మే 4 :**



జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ ఉద్యమంలో మంచి పరిణామం. JAC అధ్వర్యంలో అఖిలపక్షం సోమవారం ముఖ్య మంత్రిని కలిసింది.ఈ సందర్బంగా జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కరానికి CM వేగవంతం గా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ కు ప్రత్యామ్నాయ యార్డ్ ల నిర్మాణం లో ఆయా ప్రాంతాల నుండి ప్రతి పక్షాలు మరియూ ప్రజల నుండి వస్తున్న వ్యతిరేకత ను అధిగమించడానికి ఈ నెల 15 వ తేది తరవాత రాష్ట్రస్థాయి అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేసి సమస్య పరిష్కరానికి కృషి చేస్తానని CM హామీ ఇచ్చారు.

విదేశాలలో అమలవుతున్న నూతన టెక్నాలజీ పై అవగాహన కలిపించుటకై అఖిల పక్షాన్ని విదేశాలకు పంపిస్తా నని CM పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో... ఈటెల రాజేందర్ MP, చామకూర మల్లా రెడ్డి MLA, వజ్రేష్ యాదవ్ DCC అధ్యక్షులు డంపింగ్ యార్డ్ వ్యతిరేక జేఏసీ నాయకులు మొదలగువారు...



## శ్రావ్యను ఘనంగా సన్మానించిన స్కూల్ యాజమాన్యం

**జయభేరి, దేవరకొండ :**

తెలంగాణ మోడల్ స్కూల్, దేవరకొండలో 10వ తరగతి ఫలితాల్లో జల్దా శ్రావ్య 600లో 541 మార్కులు సాధించి ప్రతిభ చాటుకుని టాపర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో తల్లిదండ్రులు జల్దా చంద్రకళ భాస్కర్ సమక్షంలో శ్రావ్యను ఘనంగా సన్మానించారు. ఆమెకు శాలువాతో సత్కరించి మెమెంటోను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఆశీర్వాదం మరియు ఉపాధ్యాయులు ప్రవీణ్, కర్ణాకర్, సైదులు, నాగరాజు, బిక్య, కలికి, సుజాత మేడం పాల్గొని శ్రావ్య కృషిని ప్రశంసించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, శ్రావ్య సాధించిన విజయం ఆమె పట్టుదల, కృషి, గురువుల మార్గదర్శకత్వం మరియు తల్లిదండ్రుల ప్రోత్సాహానికి నిదర్శనమని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## వయో వృద్ధుల ఆశ్రమంలో ఘనంగా జన్మదిన వేడుకలు



**జయభేరి, దేవరకొండ :**

BRS పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ భీల్యానాయక్, రాష్ట్ర నాయకులు నేనావత్ కిషన్ నాయక్ జన్మదిన వేడుకలు దేవరకొండ పట్టణంలోని వయో వృద్ధుల ఆశ్రమంలో BRS యువ నాయకుడు నేనావత్ నాగార్జుననాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వయో వృద్ధుల ఆశ్రమం లో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేసినారు. వృద్ధులకు పండ్లు ,పాలు, బ్రేడ్ పంపిణీ చేశారు. ఒకరోజు భోజనం వయోవృద్ధులకు భోజనాలు ఏర్పాటు చేశారు వృద్ధ మాతలు బిలియ నాయక్ , కిషన్ నాయక్ లకు ఆశీర్వాదం ఇచ్చినారు. ఈ కార్యక్రమంలో నేనావత్ నాగార్జున నాయక్ , నర్సింహ నాయక్ , లక్ష్మణ్, యాదగిరి ,తరి గోవర్ధన్, యండి ఖాజా, నేనావత్ నగేష్, చిత్రం రమేష్, ఆంగోత్ సంతోష్, నేనావత్ హతీరామ్, దేవావత్ నిరంజన్, నేనావత్ రాజా , అలీమ్ ,పీటర్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.




# ముంబైకి మూడో విజయం..!

వాంఖడే పరుగుల వరదతో.. సిక్సర్ల మోతతో దద్దరిల్లింది. కానీ, ఈసారి ముంబై ఇండియన్స్ ప్రత్యర్థికి అవకాశమివ్వలేదు. గత మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ బౌలర్లకు దాసోహమైన చోటే సగర్వంగా జట్టును గెలిపించారు. నికోలస్ పూరన్(63) విధ్వంసంతో లక్నో 229ని లక్ష్యంగా నిర్దేశించగా రోహిత్ శర్మ(84), రికెల్టన్(83)లు తమ తడాఖా చూపిస్తూ శతక భాగస్వామ్యంతో చెలరేగారు. కసికొద్ది ఆడిన ఇద్దరూ సగం ఓవర్ల లోనే మ్యాచ్ గమనాన్ని మార్చేశారు. నమన్ ధిర్(23 నాటౌట్) లాంఛనం పూర్తి చేసి ముంబైకి మూడో విజయం కట్టబెట్టాడు.

పంతొమ్మిదో సీజన్‌లో పేలవమైన ఆటతో అట్టడుగున నిలిచిన ముంబై, లక్నో మ్యాచ్‌లో.. ముంబై జయభేరి మోగించింది. తొలుత బౌలర్లు ధారాళంగా పరుగులు సమర్పించుకున్న ఇంప్యాక్ట్ సబ్ రోహిత్ శర్మ(84), రికెల్టన్(83) వీరబాదుడుతో సగం ఓవర్లకే లక్ష్యాన్ని కరిగించేశారు. ఈ ఇద్దరూ పోటీపడి బౌండరీలు బాదగా.. లక్నో బౌలర్లు, ఫీల్డర్లు కుదేలయ్యారు. రికెల్టన్, రోహిత్ దూకుడుతో వడివడిగా గెలుపు దిశగా సాగింది ముంబై.

లక్నో నిర్దేశించిన భారీ ఛేదనలో ముంబై ఇండియన్స్ ఓపెనర్లు తగ్గేదేలే అన్నట్లు ఆడారు. ఇంప్యాక్ట్ సబ్‌గా వచ్చిన రోహిత్ శర్మ(84) తన మార్క్ విధ్వంసంతో అలరించిగా.. రికెల్టన్(83) వీరకొట్టుడుతో లక్నో బౌలర్లకు చుక్కలు చూపించాడు. 8.1 ఓవర్లలోనే వీరిద్దరూ స్కోర్ 100 దాటించారు. మ్యాచ్‌ను లాగేసుకుంటున్న ఈ ద్వయాన్ని విడదీసి లక్నోకు బ్రేకిచ్చాడు. దాంతో.. 143 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. ఎడాపెడా ఉతికేస్తున్న హిట్‌మ్యాన్‌ను సిద్ధార్థ్ ఔట్ చేసినా అప్పటికే ముంబై గెలుపు వాకిట నిలిచింది. అనంతరం.. తిలక్ వర్మ(11), కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్(12)లు వెనుదిరిగినా.. నమన్ ధిర్(23 నాటౌట్), విల్ జాక్స్(10 నాటౌట్)లు మరో వికెట్ పడకుండా ముంబైని విజయ తీరాలకు చేర్చారు. 9 మ్యాచుల్లో ఏడో ఓటమితో రిషభ్ పంత్ సేన ప్లే ఆఫ్స్ నుంచి నిష్క్రమించింది.

టాస్ ఓడిన లక్నో సూపర్ జెయింట్స్ భారీ స్కోర్‌తో ముంబైకి సవాల్ విసిరింది. వాంఖడే స్టేడియంలో ఓపెనర్ జోష్ ఇంగ్లిస్(13) విఫలమైనా.. మిచెల్ మార్ష్(44) జతగా నికోలస్ పూరన్(63 21 బంతుల్లో ఫోర్, 8 సిక్సర్లు) ముంబై బౌలర్లపై పిడుగల్లే పడ్డాడు. ఈ సీజన్‌లో తొలిసారి తుఫాన్ ఇన్నింగ్స్ ఆడిన పూరన్ 16 బంతుల్లోనే అర్ధ శతకం అందుకున్నాడు. కెప్టెన్ పంత్(15) మరోసారి తేలిపోగా.. మర్క్‌రమ్(31 నాటౌట్), హిమ్మత్ సింగ్(40 నాటౌట్)లు దూకుడు కొనసాగించగా లక్నో స్కోర్ రెండొందలు దాటింది. సమిష్టిగా రాణించగా లక్నో నిర్ణీత ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 228 పరుగులు కొట్టింది.





# కోహ్లీ జోడీ అతడేనా..!

పంతొమ్మిదో సీజన్‌లో ప్లే ఆఫ్స్‌కు చేరువైన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కీలక బ్యాటర్ సేవల్ని కోల్పోయింది. ధనాధన్ ఆటతో శుభారంభాలు ఇచ్చే ఓపెనర్ ఫిల్ సాల్ట్ అనూహ్యంగా స్వదేశానికి పయనమయ్యాడు. వరసగా మూడు మ్యాచ్‌లకు దూరమైన సాల్ట్ గాయంతో బాధ పడుతుండడమే అందుకు కారణం. మెరుగైన చికిత్స కోసం ఈ డాషింగ్ బ్యాటర్ ఇంగ్లండ్‌కు వెళ్లాడు. దాంతో.. అతడు తిరిగి ఎప్పుడు ఆర్సీబీ స్క్వాడ్‌లో కలుస్తాడు? అనేది తెలియడం లేదు.

టాపార్డ్‌లో దంచికొడుతూ ఆర్సీబీ విజయాల్లో కీలకమైన ఫిల్ సాల్ట్ ఐపీఎల్‌కు దూరమయ్యాడు. వేలి గాయంతో బాధ పడుతున్న సాల్ట్ స్వదేశం వెళ్లాడు.

అక్కడ స్కానింగ్ పరీక్షలు చేయించుకొని కోలుకున్నాక తిరిగొచ్చే అవకాశముంది. ఏప్రిల్ 18న ఢిల్లీ క్యాపిటల్స్‌తో మ్యాచ్ అనంతరం సాల్ట్ మైదానంలోకి దిగలేదు. దాంతో.. సాల్‌ట్‌కు ఏమైంది? అని అభిమానులు ఆందోళన చెందారు. వారు భయపడినట్టే ఈ విధ్వంసక ప్లేయర్ సీజన్ మధ్యలోనే స్వదేశం బాట పట్టాడు.

సాల్ట్ గైర్హాజరీలో విరాట్ కోహ్లీ జతగా కుర్రాడు జాకబ్ బెథెల్ ఇన్నింగ్స్ ఆరంభించడం ఖాయమైనట్టే. దూకుడైన ఆటతో ప్రత్యర్థి బౌలర్లను భయపెట్టే సాల్ట్ అందుబాటులో లేకపోవడంతో చురుకైన ఫీల్డర్‌ను కూడా బెంగళూరు కోల్పోయింది. 18వ సీజన్‌లో ఆర్సీబీ ఛాంపియన్‌గా నిలవడంలో కీలక పాత్ర పోషించిన సాల్ట్.. 19వ ఎడిషన్‌లోనూ దంచేశాడు. కేవలం ఆరు ఇన్నింగ్స్‌ల్లోనే 168.33 స్ట్రయిక్ రేటుతో 202 రన్స్ సాధించాడు. ప్రస్తుతం రెండో స్థానంలో కొనసాగుతున్న ఆర్సీబీ మే 7న లక్నో సూపర్ జెయింట్స్‌ను ఢీ కొట్టనుంది.



# మహిళలు.. ఈ వ్యాయామాలతో పీరియడ్స్ నొప్పి దూరం..

**ఋతుక్రమ నొప్పి నుండి ఉపశమనం పొందడానికి సున్నితమైన వ్యాయామం గొప్ప మార్గం. కొన్ని ప్రభావవంతమైన వ్యాయామాలలో పెల్విక్ టిల్ట్‌లు, నడుము, గ్లూట్ స్ట్రెచింగ్‌లు, పిల్లల భంగిమ వంటి యోగా భంగిమలు ఉన్నాయి. నడక, ఈత, తేలికపాటి కార్డియో కూడా రక్త ప్రసరణను మెరుగుపరచడం, సహజ నొప్పి నివారణ మందులుగా పనిచేసే ఎండార్ఫిన్‌లను విడుదల చేయడం ద్వారా సహాయపడతాయి.**

**పెల్విక్ టిల్ట్స్ :**
మీ మోకాళ్లను వంచి, పాదాలను నేలపై ఉంచి మీ వీపు మీద పడుకోండి. మీ పొత్తికడుపు కండరాలను నిమగ్నం చేస్తూ, మీ పెల్విస్‌ను మెల్లగా పైకి వంచండి. కొన్ని సెకన్ల పాటు అలాగే ఉండి, ఆపై విశ్రాంతి తీసుకోండి. దీన్ని 1015 సార్లు పునరావృతం చేయండి. ఇలా చేస్తే ఋతుక్రమ నొప్పి నుంచి బయటపవచ్చు.

**నడుము కింది భాగం, గ్లూట్ స్ట్రెచ్:**
మీ కుడి పాదాన్ని ముందుకు, ఎడమ పాదాన్ని వెనుకకు ఉంచి, మడమను పైకి లేపి ప్రారంభించండి. మీ ముందు మోకాలిని వంచి, మీ చేతులను తలపైకి చాచండి. సాగదీసేటప్పుడు మీ తుంటిని కుడి వైపుకు బయటికి కదిలించండి. దీనివల్ల పీరియడ్ పెయిన్ దూరం అవుతుంది.

**పిల్లల భంగిమ:**
నేలపై మోకరిల్లి మీ మడమల మీద తిరిగి కూర్చోండి. ముందుకు వంగి, మీ మొండెంను మీ తొడల మధ్య ఉంచండి. మీ చేతులను ముందుకు చాచండి లేదా వాటిని మీ వైపులా విశ్రాంతి తీసుకోండి. ఈ భంగిమను కొన్ని నిమిషాలు పట్టుకోండి. ఈ భంగిమ ద్వారా ఋతుక్రమ నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది.

**ఇతర ఉపయోగకరమైన వ్యాయామాలు:**
సున్నితమైన యోగా భంగిమలు కండరాలను సడలించడానికి మరియు ఉద్రిక్తతను తగ్గించడానికి సహాయపడతాయి. చురుకైన నడక రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది మరియు నొప్పిని తగ్గిస్తుంది. నీటిలో ఈత సామర్థ్యం మద్దతు, సున్నితమైన వ్యాయామాన్ని అందిస్తుంది. కొన్ని పైలేట్స్ వ్యాయామాలు కోర్ కండరాలను బలోపేతం చేస్తాయి మరియు భంగిమను మెరుగుపరుస్తాయి.

**ముఖ్యమైన విషయాలు:**
ఏదైనా వ్యాయామం నొప్పిని కలిగిస్తే, ఆగి విశ్రాంతి తీసుకోండి. భారీ వ్యాయామాలు కొన్నిసార్లు తిమ్మిరిని మరింత తీవ్రతరం చేస్తాయి. పుష్కలంగా నీరు త్రాగడం వల్ల కండరాల తిమ్మిరిని నివారించవచ్చు. హీటింగ్ ప్యాడ్ వేయడం లేదా వెచ్చని స్నానం చేయడం కూడా ఉపశమనం కలిగిస్తుంది.



# చివరకు తన మూవీలోనే ఛాన్స్..



మమతా మోహన్‌దాస్ తన తొలి తెలుగు సినిమా అరుంధతి కావాల్సి ఉంది, దాని కోసం సంతకం చేసి ఆపై తప్పుకున్నానని చెప్పారు. ఆ సమయంలో తెలుగు చిత్ర పరిశ్రమ గురించి తనకు ఏమీ తెలియదని, తాను మలయాళీని అని, బహ్రెయిన్‌లో పెరిగిన ఎన్నారై కావడంతో తెలుగు భాష, పరిశ్రమపై అవగాహన లేదని వివరించారు. మేనేజర్ సలహా మేరకు ఆ ప్రొడక్షన్‌కు ఆర్థిక సమస్యలు ఉన్నాయని, అది మంచిది కాదని భావించి భయపడ్డానని తెలిపారు. దీనితో అరుంధతి ప్రాజెక్ట్ నుండి తప్పుకున్నట్లు ఆమె పేర్కొన్నారు. మమతా నిర్ణయం శ్యామ్ ప్రసాద్ రెడ్డిని తీవ్రంగా కలచివేసిందని, మూడు నెలల పాటు ఆయన తనను ఒప్పించేందుకు ప్రయత్నించారని తెలిపారు. అరుంధతి పాత్రకు తానొక్కటే సరైన అభ్యర్థి అని ఆయన బలంగా నమ్మారని మమతా గుర్తుచేసుకున్నారు. చివరికి ఆమె ఆ ప్రాజెక్ట్‌ను వదులుకున్నారు. సుమారు ఒకటిన్నర సంవత్సరం తర్వాత, మమతా నటించిన పోకిరి పిల్లా (డబ్బింగ్ సినిమా)ను చూసిన రాజమౌళి ఆమెను యమదొంగలోని ధనలక్ష్మి పాత్రకు ఎంపిక చేశారు. ఈ చిత్రం ద్వారానే మమతా మోహన్‌దాస్ తెలుగు తెరకు పరిచయం అయ్యారు. యమదొంగ చిత్రీకరణ సమయంలో రాజమౌళి అరుంధతి సినిమా గురించి ప్రస్తావించి, ఆ చిత్రం వదులుకోవడం ఆమె చేసిన పెద్ద తప్పు అని చెప్పారని మమతా తెలిపారు. రాజమౌళి ఆ మాట చెప్పినప్పుడు అరుంధతి ఇంకా నిర్మాణ దశలోనే ఉందని, అయితే అప్పుడే ఆ చిత్రం ఎంత పెద్ద విజయం సాధిస్తుందో సినీ పరిశ్రమలోని అందరికీ తెలుసని మమతా పేర్కొన్నారు. ఆ సినిమాలోని హీరోయిన్ పాత్ర ఒక నటి కెరీర్‌ను దశాబ్దాల పాటు నిలబెడుతుందని అప్పటికే చర్చ జరిగిందని మమతా మోహన్‌దాస్ వివరించారు.



# ఏంటీ ప్రభాస్ కల్కి సీక్వెల్ షూట్‌లో జాయిన్ అయ్యాడా..?

ప్రభాస్ అభిమానులతో, సైన్స్ ఫిక్షన్ జోనర్ సినిమాలను ఇష్టపడే ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రాజెక్టుల్లో ఒకటి 'కల్కి 2898 AD' ఫ్రాంచైజీ. ఇప్పటికే ఫస్ట్ పార్ట్‌తో బాక్సాఫీస్‌ను షేక్ చేసిన ప్రభాస్‌నాగ్ అశ్విన్ టీం ఇక సీక్వెల్‌తో ఎంటర్‌టైన్ చేసేందుకు రెడీ అవుతున్నారని తెలిసిందే. అయితే సీక్వెల్ ఎప్పుడు సెట్స్‌పైకి వెళ్తుందా అని ఎదురుచూస్తున్న మూవీ లవర్స్ కోసం ఇప్పటికే అమితాబ్ బచ్చన్ షూట్‌లో పాల్గొన్నట్టు ఆసక్తికర అప్‌డేట్ ఒకటి బయటకు వచ్చింది. తాజాగా మరో ఆసక్తికర వార్త బయటకు వచ్చింది. హీరో ప్రభాస్ నేడు కల్కి సీక్వెల్ షూట్‌లో జాయిన్ అయ్యాడట. ఎక్కువగా నైట్ షూట్స్ ఉండనుండగా.. కొన్ని రోజులపాటు ఈ షెడ్యూల్‌లో పాల్గొనున్నట్టు ఇన్‌సైడ్ టాక్. మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ప్రభాస్ షూట్‌కు సంబంధించి మేకర్స్ ఏమైనా అప్‌డేట్స్ అందిస్తారేమో చూడాలి. కాగా ఫస్ట్ పార్ట్‌లో దీపికా పదుకొనే పోషించిన సుమతి పాత్ర కోసం సీక్వెల్‌లో ఇంకా ఏ నటిని ఫైనల్ చేయలేదు మేకర్స్. కమల్ హాసన్‌తోపాటు పలువురు కీలక నటీనటులు సీక్వెల్‌లో కనిపించబోతున్నట్టు తెలుస్తుండగా.. మేకర్స్ నుంచి అప్‌డేట్ రావాల్సి ఉంది. భారీ విజువల్ వండర్‌గా మారిన 'కల్కి 2898 AD'లో ప్రభాస్, దీపికా పదుకొణె, అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ లాంటి లీడ్‌యాక్టర్లు నటించడంతో ఈ మూవీ ప్రపంచవ్యాప్తంగా రూ.1000 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. భారీ విఎఫ్ఎక్స్, యూనిక్ కాన్సెప్ట్‌తో ప్రేక్షకుల మన్ననలు పొందింది. ఫస్ట్ పార్ట్‌ను తెరకెక్కించిన వైజయంతీ మూవీస్ బ్యానర్‌పై సీ అశ్వనీదత్ ఈ చిత్రాన్నినిర్మించనున్నారు.

# టీవీకే దూకుడు నడుమ కృష్ణగిరిలో విషాదం..



తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రారంభమైనప్పటి నుంచి రాష్ట్ర రాజకీయాల్లో ఉత్కంఠత నెలకొంది. ముఖ్యంగా నటుడు విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) అనూహ్యంగా ముందంజలో కొనసాగుతోంది. ట్రెండ్స్ ప్రకారం, డీఎంకే, ఏఐఏడీఎంకే కూటములతో పోలిస్తే టీవీకే 100కి పైగా స్థానాల్లో ఆధిక్యంలో ఉండటం అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. ఈ పరిణామాలతో రాష్ట్ర రాజకీయ సమీకరణాలు ఒక్కసారిగా మారిపోతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో కృష్ణగిరి జిల్లాలో ఓ విషాదకర సంఘటన చోటుచేసుకుంది. విజయ్‌కు వీరాభిమాని అయిన మహేంద్రన్ (28) ఓ పుకారును నమ్మి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఓట్ల లెక్కింపు ప్రారంభానికి ముందు, విజయ్ ఎన్నికల్లో ఓడిపోతాడనే వదంతులు స్థానికంగా వ్యాపించడంతో మహేంద్రన్ తీవ్ర మనస్తాపానికి గురైనట్లు తెలుస్తోంది. ఇంటి బయట నిలబడి ఉన్న సమయంలో చేతిలో ఉన్న కత్తితో తన గొంతు కోసుకుని ప్రాణాలు తీసుకోవాలని ప్రయత్నించాడు. ఘటనను గమనించిన స్థానికులు వెంటనే స్పందించి అతడిని రక్షించి కృష్ణగిరి ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతను ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. పోలీసుల ప్రాథమిక విచారణలో, ఎన్నికల ఫలితాలపై వ్యాపించిన వదంతులే ఈ దారుణానికి కారణమని తేలింది. విజయ్ ఓడిపోతాడనే ప్రచారాన్ని నిజమని నమ్మిన మహేంద్రన్ మానసిక ఆవేదనతో ఈ చర్యకు పాల్పడ్డాడని అధికారులు తెలిపారు. ఇక ఎన్నికల నేపథ్యంలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు రాజకీయ పార్టీలు తమ కార్యకర్తలకు కీలక సూచనలు చేస్తున్నాయి. వదంతులను నమ్మకుండా, అధికారిక ఫలితాల కోసం వేచి చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మొత్తానికి టీవీకే ప్రభంజనం సృష్టిస్తున్న ఈ ఎన్నికల్లో, ఒక అభిమాని ఆత్మహత్యాయత్నం చేయడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఎన్నికల ఉత్కంఠ నడుమ భావోద్వేగాలకు లోనుకాకుండా శాంతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.



# బాడీ షేమింగ్‌తో నరకం చూశా..

ప్రముఖ క్యారెక్టర్ ఆర్టిస్ట్ సురేఖా వాణి కుమార్తెగా ప్రేక్షకులకు పరిచయమైన సుప్రిత ఇటీవల తన వ్యక్తిగత జీవితంలోని కఠిన అనుభవాలను గుర్తుచేసుకుని భావోద్వేగానికి గురయ్యారు. సోషల్ మీడియా స్టార్‌గా కెరీర్ ప్రారంభించిన ఆమె, ప్రస్తుతం హీరోయిన్‌గా సినీ రంగంలో ముందుకు సాగుతున్నారు. ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ సుప్రిత, సోషల్ మీడియాలో ఎదురైన విమర్శలు, బాడీ షేమింగ్ కామెంట్లు తనపై తీవ్ర ప్రభావం చూపాయని చెప్పారు. బరువు తగ్గాలనే ఆరాటంలో తాను అనుసరించిన తప్పుడు ఆహారపు అలవాట్లు తన ఆరోగ్యాన్ని పూర్తిగా దెబ్బతీశాయని వెల్లడించారు. రోజుకు 15 గంటల పాటు ఏమీ తినకుండా ఉండి, తర్వాత ఒక్కసారిగా హెవీ ఫుడ్ తీసుకునేదాన్ని. దీంతో వాంతులు, తీవ్రమైన ఆరోగ్య సమస్యలు వచ్చాయి. ఇక అగ్ర హీరోల సినిమాల్లో కూడా తాను నటించాలనే ఆసక్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా పవన్ కళ్యాణ్, ఎన్టీఆర్ సినిమాల్లో చెల్లెలి పాత్రలు వచ్చినా చేయడానికి రెడీ అని చెప్పారు. అయితే తనకు ఇష్టమైన విజయ్ దేవరకొండ, అఖిల్ అక్కినేని సరసన అలాంటి పాత్రలు చేయడం కష్టమని సరదాగా వ్యాఖ్యానించారు. సుప్రిత ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. తల్లి ప్రోత్సాహంతో నటనలో శిక్షణ తీసుకున్న ఆమె, ఇప్పటికే కొన్ని సినిమాల ద్వారా ప్రేక్షకులను అలరించారు. బిగ్ బాస్ ఫేమ్ అమర్ దీప్ చౌదరి సరసన నటిస్తున్న 'చౌదరి గారి అబ్బాయితో నాయుడు గారి అమ్మాయి' సినిమా విడుదలకు సిద్ధంగా ఉంది. 2019లో 'మనీ మైండెడ్ గర్ల్ ఫ్రెండ్' షార్ట్ ఫిల్మ్‌తో ప్రారంభమైన సుప్రిత ప్రయాణం, ఇప్పుడు వెండితెరపై మరింత బలంగా కొనసాగుతోంది. గ్లామర్‌తో పాటు నటనకు ప్రాధాన్యమున్న పాత్రలను ఎంచుకుంటూ, తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకునే దిశగా ఆమె అడుగులు వేస్తున్నారు.

# గెట్ రెడీ ఫర్ టీజర్..

## క్యూరియాసిటీ పెంచేస్తున్న 'ది రెడ్ బ్యాగ్' టీం




విలన్‌గా తెలుగు ప్రేక్షకుల్లో మంచి ఫ్యాన్ బేస్ సంపాదించుకున్నాడు హర్యానా యాక్టర్ కబీర్ దుహన్ సింగ్. ఇప్పటిదాకా సిల్వర్ స్క్రీన్‌పై విలన్‌గా భయపెట్టిన కబీర్ దుహన్ సింగ్ లీడ్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం 'ది రెడ్ బ్యాగ్' (The Red Bag). ప్రసాద్ బెహరా మరో కీలక పాత్రలో నటించిన ఈ మూవీలో రాధ్య, స్నేహా సింగ్, ఆకాంక్ష ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు.

మేకర్స్ ఇప్పటికే ఈ మూవీ ప్రీ లుక్‌ను విడుదల చేశారు. నలుగురు అమ్మాయిల లుక్స్‌తో రిలీజ్ చేసిన ఈ పోస్టర్‌తో బ్యాగ్ చుట్టూ తిరిగే కథాంశంతో యాక్షన్ థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో సాగే ఈ చిత్రం డిఫరెంట్ కాన్సెప్ట్‌తో రాబోతుందంటూ హింట్ ఇచ్చారు మేకర్స్. ఇటీవలే ఈ చిత్రానికి సంబంధించిన రిలీజ్ చేసిన మరో పోస్టర్‌లో చేతినిండా రక్తం, ఆ బ్యాగును పట్టుకున్న తీరు, అక్కడే ఉన్న కత్తులు, తుపాకులు, రక్తపుమయంగా మారిన ఏరియా ఇలా ప్రతీ ఒక్కటి ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ పెంచేస్తున్నాయి.

ఇటీవల సినిమాలో వచ్చే కీలక సన్నివేశాలను థాయ్‌లాండ్‌లో షూట్ చేసింది టీం. థాయ్‌లాండ్‌లో వచ్చే సన్నివేశాలు సినిమాకే హైలెట్‌గా నిలువబోతున్నాయట. పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉన్న ఈ చిత్రం టీజర్‌ను త్వరలోనే విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు మేకర్స్. నిర్మాత హరికృష్ణ సోమిశెట్టికి డెబ్యూ సినిమానే అయినా భారీ బడ్జెట్‌తో సినిమాను తెరకెక్కిస్తుండటం విశేషం.

ఇంతకీ ది రెడ్ బ్యాగులో ఏముంది.. కబీర్ దుహన్ సింగ్ పాత్ర ఎలా ఉండబోతుందనేది మాత్రం సస్పెన్స్‌లో పెట్టేశారు మేకర్స్. ఈ మూవీకి రవికుమార్ సీరపు కథ, కథనం అందించడమే కాకుండా దర్శకత్వం కూడా వహిస్తున్నాడు. ది రెడ్ బ్యాగ్‌లో ఈషాన్ శంకర్, అవినాష్‌బాదల్, భార్గవి ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at **Sri Muktheswara Publications**, Plot No. 31, Mallikarjuna Nagar Colony, Sagar Ring Road, Bairamal Guda, Hyderabad-500079, Dist. Rangareddy, Telangana. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889**. **PRGI No: TGTEL/25/A0314**. email: **jayabherinews@gmail.com**, **www.jayabheridaily.com**